తెలుగు దినపత్రిక
jayabheridaily.com
ప్రభాత
# జయభేరి
ప్రజల పక్షాన అక్షర యజ్ఞం
సంపుటి : 01
సంచిక : 226
పేజీలు : 5
వెల : 4
మల్కాజిగిరి
ఆదివారం, 31-03-2024

KISHAN COMPUTERS
SALES & SERVICE
Computers, Laptop Repair
Mother Board Repair,
Printers Repair,
Catrige Refilling,
New Catriges,
Ink Bottles, Accessories

Near MRO Office, Opp. Shamirpet Lake,
Shamirpet Mandal, Medchal Dist.
Cell: 80994 82143, 99488 05009



## కాంగ్రెస్ పార్టీలో చేరిన హైదరాబాద్ మేయర్

జయభేరి, హైదరాబాద్, మార్చ్ 30:

లోక్ సభ ఎన్నికల వేళ బీఆర్ఎస్ పార్టీకి గట్టి షాక్ తగిలింది. హైదరాబాద్ మేయర్ గద్వాల విజయలక్ష్మి కాంగ్రెస్ పార్టీలో చేరారు. తెలంగాణ కాంగ్రెస్ ఇంచార్జ్ దీపాదాస్ మున్షీ, తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. విజయలక్ష్మికి సీఎం రేవంత్ రెడ్డి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. విజయలక్ష్మితోపాటు ఆమె సోదరుడు వెంకట్ కూడా పార్టీలో చేరారు. ఇటీవల తాము బీఆర్ఎస్ పార్టీని వీడమని వెంకట్ ప్రకటించిన సంగతి తెలిసిందే. ఆ వెంటనే సోదరితో కలిసి కాంగ్రెస్ పార్టీలో చేరారు. బీఆర్ఎస్ జనరల్ సెక్రటరీ, సీనియర్ నేత కే కేశవరావు కూడా కాంగ్రెస్ పార్టీలో చేరబోతున్నారు. బీఆర్ఎస్ స్టేషన్ ఘన్ పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి, ఆయన కూతురు కావ్య కూడా కాంగ్రెస్ పార్టీలో చేరే అవకాశం ఉంది. ఇప్పటికే ఖైరతాబాద్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే దానం నాగేందర్ కాంగ్రెస్ పార్టీలో చేరిన సంగతి తెలిసిందే. కడియం శ్రీహరి పార్టీలో చేరికతో కాంగ్రెస్ సభ్యుల సంఖ్య 66కి చేరుతుంది. మిగతా నేతలు కూడా కాంగ్రెస్ పార్టీలో చేరేందుకు క్యూ కడుతున్నారు.



# పీవీకి భారతరత్న

2లో

జయభేరి, న్యూఢిల్లీ, మార్చి 30:

దేశ అత్యున్నత పౌర పురస్కారం 'భారతరత్న' ప్రదానోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్లో జరిగిన కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము భారతరత్న పురస్కారాలను ప్రదానం చేశారు. దివంగత మాజీ ప్రధానమంత్రి పీవీ నరసింహారావు తరఫున ఆయన కుమారుడు ప్రభాకర్రావు ఈ పురస్కారాన్ని స్వీకరించారు. కాగా.. పలు రంగాల్లో అసాధారణ సేవలందించిన వారికి భారత ప్రభుత్వం భారతరత్నను ప్రదానం చేస్తోంది. అయితే, ఈ ఏడాది ఐదుగురు ప్రముఖులకు మూడు విడతల్లో అత్యున్నత పురస్కారం 'భారతరత్న'ను ప్రకటించింది.

## లిక్కర్ స్కామ్ లో మరో ఆప్ నేత

జయభేరి, న్యూఢిల్లీ, మార్చి 30:



ఢిల్లీ లిక్కర్ పాలసీ స్కామ్ కేసులో మరో కీలక పరిణామం జరిగింది. ఈ కేసులో మరో ఆప్ నేత, ఢిల్లీ మంత్రి కైలాశ్ గహ్లోట్కి ఈడీ సమన్లు జారీ చేసింది. విచారణకు హాజరు కావాలని ఆదేశించింది. ఈ మేరకు ఆయన ఈడీ ముందు హాజరయ్యారు. ఇప్పటికే ఈ కేసులో ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ని ఈడీ అధికారులు మార్చి 21న అరెస్ట్ చేశారు. ఇప్పుడు మరో మంత్రినీ విచారిస్తుండడం సంచలనమవుతోంది. నజఫ్ఘర్ నుంచి ఎమ్మెల్యేగా ఉన్న కైలాశ్ గహ్లోట్ లిక్కర్ పాలసీ రూపొందించిన ప్యానెల్లో సభ్యుడిగా ఉన్నారు. ఈ స్కామ్తో గహ్లోట్కి ఏమైనా సంబంధం ఉందా అనే కోణంలో విచారిస్తున్నారు అధికారులు. ఈడీ ఆరోపణల ప్రకారం...ఈ లిక్కర్ పాలసీ డ్రాఫ్ట్ని సౌత్ గ్రూప్ కి లీక్ చేశారు. లిక్కర్ పాలసీని రూపొందించే సమయంలో ఆప్ కమ్యూనికేషన్ ఇన్చార్జ్ విజయ్ నాయర్ గహ్లోట్ ఇంట్లో ఉన్నారని ఈడీ ఆరోపిస్తోంది. అంతే కాదు. కైలాశ్ గహ్లోట్ పదేపదే మొబైల్ నంబర్స్ మార్చడంపైనా అనుమానం వ్యక్తం చేస్తోంది. మార్చి 28వ తేదీన ఈడీ అధికారులు అరవింద్ కేజ్రీవాల్ని కోర్టులో హాజరు పరిచారు. ఏప్రిల్ 1వ తేదీ వరకూ కస్టడీలో ఉంచేలా అనుమతి తీసుకుంది ఈడీ. కేజ్రీవాల్తో పాటు మరో ఇద్దరు ఆప్ నేతలూ ఇప్పటికే ఇదే కేసులో జైల్లో ఉన్నారు. రాజ్యసభ ఎంపీ సంజయ్ సింగ్, మంత్రి సత్యేంద్ర జైన్ అరెస్ట్ అయ్యారు. ఢిల్లీ లిక్కర్ పాలసీ పేరుతో భారీ ఎత్తున వీళ్లంతా మనీ లాండరింగ్కి పాల్పడినట్టు ఈడీ తేల్చి చెబుతోంది. కొంత మందికి లబ్ధి చేకూర్చే విధంగా పాలసీని తయారు చేయడమే కాకుండా వాళ్ల నుంచి భారీ ఎత్తున ముడుపులు తీసుకున్నట్టు ఈడీ చెబుతోంది. అయితే...ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ వీకే సక్సేనా ఈ పాలసీలో అవకతవకలున్నాయని స్పష్టం చేశారు. పూర్తిస్థాయిలో విచారణ చేపట్టాలని ఆదేశించారు. ఆ తరవాతే ఇదంతా బయటపడింది.



## పోలీస్ శాఖలో ఏం జరుగుతోంది

జయభేరి, హైదరాబాద్, మార్చి 30:

తెలంగాణ పోలీస్ శాఖకు గ్రహణం పట్టింది. రక్షించాల్సిన పోలీసులే రాంగ్ రూట్లోకి వెళుతున్నారు. రకరకాల కారణాలతో వివిధ హోదాల్లో ఉన్న పోలీసులు వివాదాల్లో చిక్కుకుంటున్నారు. యువతిపై అత్యాచారం, ప్రజాప్రతినిధి

...మిగతాది 2 లో

## చేసేది సబ్ ఇన్స్పెక్టర్ ఉద్యోగం
## మొత్తం అవినీతి బాగోతం..!?

- ఏసీబీ వలలో చిక్కిన మీర్పేట సబ్ ఇన్స్పెక్టర్ సైదులు
- రక్షక భట వృత్తిలో
- అవినీతికి పాల్పడ్డ వ్యభిచారి



జయభేరి, మీర్పేట్:

ఇదిగో కాకి చొక్క వేసుకుని ఏం సక్క ఫోజు కొడుతున్న ఈ సబ్ ఇన్స్పెక్టర్ పేరు సైదులు. మాట తీరు చాలా మృదువుగా ఉంటుంది. పద్ధతులు మాత్రం అనుమానాస్పదంగానే ఉంటాయి. అస్సలు అనుమానానికి చోటు ఇవ్వకుండా మెదులుతూ ఉంటాడు.. ఇదే ఇతని స్టైల్.... మొత్తానికి దొంగ బయటపడ్డాడు. ఇక వివరాలుకెళ్తే....
మీర్పేట పిఎస్ పరిధిలో పనిచేస్తున్న సబ్ ఇన్స్పెక్టర్ సైదులు ఒక భూమి గొడవకు సంబంధించి ఇరు వ్యక్తుల మధ్య ఉన్న చిచ్చును పరిష్కరించే నేపథ్యంలో ఇద్దరు వ్యక్తుల మధ్యలో నుంచి ఒక వర్గం నుండి రూ .10 వేల రూపాయలు లంచంగా అడిగి డాని రంగారెడ్డి ఎసిపికి సమాచారం అందించి చాకచక్యంగా ఏసీబీకి సమాచారం అందించాడు ఒక వర్గం వ్యక్తి... ఇంకేముంది ఏసీబీ వలపన్ని పదివేల రూపాయలు తీసుకునే సమయంలో ఏసీబీకి మెరుపుల దాడి చేసి మీర్ పేట సబ్ ఇన్స్పెక్టర్ సైదులును పట్టుకున్నారు. ఇంకేముంది మనోడి చేతులను కడిగితే రసాయనాలు ఎరుపెక్కి.. సాక్షదారాలతో ఏసీబీకి చిక్కాడు. మొత్తానికి పదివేల రూపాయలు లంచం తీసుకున్న పాపానికి ఏసీబీకి చిక్కి అరెస్టయ్యాడు మీర్ పేట ఎస్ఐ సైదులు.. ఇలాగే మరి పోలీస్ స్టేషన్లో ఇంకొంతమంది ఉన్నారని ఆరోపణలు కూడా గుప్పున వినిపిస్తున్నాయి. కానిస్టేబుల్ నుంచి సిఐ వరకు చాలా ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. కానీ దొరికింది మాత్రం సబ్ ఇన్స్పెక్టర్ సైదులు. దొరికితే దొంగ దొరకకపోతే దొర... అన్న మాదిరిగా మీర్పేట పోలీస్ స్టేషన్ నిత్యం ఏదో ఒక ఆరోపణలతో వార్తల్లోకి ఎక్కుతుంది.. రక్షకబటులు అని పిలిపించుకునే వీళ్ళే భక్షక బటులుగా మారుతున్న ఈ సందర్భంలో సమాజంలోని ప్రతి యువత విజ్ఞానంతో తెలివితో మెదిలి ఇలాంటి అవినీతి తిమింగలాలని ఏసీబీకి పట్టియాలని ఏసీబీ వర్గాలు కూడా కోరుకుంటున్నాయి.

## కేటీఆర్ కు షాక్



జయభేరి, హైదరాబాద్, మార్చి 30:

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కు షాక్ తగిలింది. ఆయనపై బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్ లో క్రిమినల్ కేసు నమోదైంది. సీఎం రేవంత్ రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ కాంగ్రెస్ నేత బత్తిన శ్రీనివాసరావు హనుమకొండ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారు. సీఎం రేవంత్ రూ.2,500 కోట్లు వసూలు చేసి కాంగ్రెస్ పెద్దలకు పంపారంటూ అసత్య ఆరోపణలు చేశారంటూ ఫిర్యాదులో పేర్కొన్నారు. దీంతో జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేసిన అక్కడి పోలీసులు ఆ కేసును బంజారాహిల్స్ పీఎస్ కు పంపారు. ఈ క్రమంలో కేటీఆర్ పై ఐపీసీ 504, 505 (2) సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు.కాగా, ఇటీవల హైదరాబాద్ లోని తెలంగాణ భవన్ లో సికింద్రాబాద్ లోక్ సభ నియోజకవర్గం సన్నాహక సమావేశంలో కేటీఆర్ మాట్లాడారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డిపై విమర్శలు గుప్పించారు. సీఎం రేవంత్.. కాంట్రాక్టర్లు, బిల్డర్ల వద్ద రూ.2,500 కోట్లు వసూలు చేసి ఢిల్లీకి పంపించారని సంచలన ఆరోపణలు చేశారు. ఆయనకు సీఎంగా పని చేసేంత తెలివి లేదని విమర్శించారు. ఫోన్ ట్యాపింగ్, మోసాల పేరుతో మీడియాలో అనవసర రాద్ధాంతం చేస్తున్నారని.. పార్లమెంట్ ఎన్నికల తర్వాత కాంగ్రెస్ నుంచి బీజేపీలో చేరే తొలి వ్యక్తి రేవంత్ రెడ్డే అంటూ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఈ వ్యాఖ్యలు కాంగ్రెస్ పార్టీతో పాటు సీఎం పరువు ప్రతిష్టలకు భంగం కలిగించేలా ఉన్నాయని.. కేటీఆర్ పై చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ నేత శ్రీనివాసరావు పోలీసులకు ఫిర్యాదు చేశారు.



## వేసవిలో త్రాగు నీటి ఎద్దడి నివారణకు చర్యలు

- అత్యవసర పరిస్థితులు ఏర్పడినప్పుడు త్రాగునీరు అందించడానికి ప్రత్యామ్నాయ ఏర్పాట్లుతో యంత్రాంగం సిద్ధంగా ఉండాలి
- జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా

జయభేరి, జయశంకర్ భూపాలపల్లి:

గ్రామాలలో మంచినీటి సరఫరాలో ఎక్కడైనా అంతరాయం ఏర్పడితే అందుకు ప్రత్యాన్మయంగా త్రాగునీరు అందించడానికి చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా ఆర్ డబ్ల్యూఎస్, గ్రిడ్, పంచాయతి అధికారులను

...మిగతాది 2 లో



## సీఎం ఇంటి వద్ద కలకలం

జయభేరి, హైదరాబాద్, మార్చి 30:

హైదరాబాద్: తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హైదరాబాద్ లోని నివాసం ఎదుట ఓ వ్యక్తి ఆత్మహత్యాయత్నం చేయడం కలకలం రేపింది. అతడు ఒంటి మీద కిరోసిన్ పోసుకుని ఆత్మహత్యాయత్నం చేశాడు. అక్కడే ఉన్న పోలీసులు అప్రమత్తమై, ఆ వ్యక్తిని అడ్డుకుని అదుపులోకి తీసుకున్నారు. సీఎం రేవంత్ రెడ్డి తనకు అపాయింట్మెంట్ ఇవ్వడం లేదని సూసైడ్ అటెంప్ట్ చేశాడని ప్రచారం జరుగుతోంది. అతడు ఎక్కడి నుంచి వచ్చాడు, ఎందుకు ఈ పచ్చి పనికి యత్నించాడన్న దానిపై పోలీసులు ఆరా తీస్తున్నారు. ఆత్మహత్యాయత్నం చేసింది కాంగ్రెస్ కు చెందిన వ్యక్తి అని తెలుస్తోంది. కొత్తగా పార్టీలో చేరే వారికి ప్రాధాన్యం ఇస్తున్నారని భూపాలపల్లికి చెందిన కాంగ్రెస్ నేత కృష్ణ సాగర్ ఆరోపించారు. తనలాంటి వారికి కాంగ్రెస్ లో గుర్తింపు, సరైన ప్రాధాన్యత దక్కడం లేదన్నారు. అందుకే సీఎం రేవంత్ రెడ్డి నివాసం వద్ద ఆత్మహత్యాయత్నం చేసి సమస్యను సీఎం దృష్టికి తీసుకెళ్లడానికి ఈ పని చేసినట్లు సమాచారం. ఆత్మహత్య అనేది నేరం కనుక, కాంగ్రెస్ నేత ఆత్మహత్యాయత్నం ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

▶▶ మొదటిపేజీ తరువాయి

## పీవీకి భారతరత్న

ఈ ఏడాదికి బిహార్ మాజీ సీఎం కర్పూరీ ఠాకూర్, బీజేపీ అగ్రనేత ఎల్కే ఆడ్వాణీ, మాజీ ప్రధాని పీవీ నరసింహారావు, మాజీ ప్రధాని చౌదరీ చరణ్సింగ్, వ్యవసాయ శాస్త్రవేత్త ఎంఎస్ స్వామినాథన్లకు భారతరత్నను ప్రకటించారు. ఒకే సంవత్సరంలో ఎక్కువమందికి దేశ అత్యున్నత పురస్కారం ప్రకటించడం ఇదే తొలిసారి. ఇందులో నలుగురికి మరణానంతరం ఈ అవార్డు లభించగా.. నేడు వారి కుటుంబసభ్యులకు పురస్కారాన్ని ప్రదానం చేశారు. కర్పూరీ ఠాకుర్ తరఫున ఆయన కుమారుడు రామ్నాథ్, చౌదరీ చరణ్ సింగ్ తరఫున ఆయన మనవుడు జయంత్ సింగ్, స్వామినాథన్ తరఫున అవార్డును కుమార్తె నిత్యా రావు స్వీకరించారు. ఈ కార్యక్రమానికి ప్రదాని మోదీ, అమిత్ షా పలువురు కేంద్రమంత్రులు హాజరయ్యారు.కాగా.. ఎల్కే ఆడ్వాణీ అనరోగ్య సమస్యలతో బాధపడుతూ అవార్డు ప్రదానోత్సవానికి హాజరుకాలేకపోయారు. ఈ నేపథ్యంలో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, ప్రధాని నరేంద్ర మోదీ ఆదివారం ఆడ్వాణీ ఇంటికెళ్లి 'భారతరత్న' ను ప్రదానం చేయనున్నారు.తెలుగు తీవి అయిన పీవీ నరసింహారావుకు దేశ అత్యున్నత పౌర పురస్కారాన్ని గడిచిన నెల 9న ప్రకటించింది కేంద్రం. దేశాన్ని మలుపు తిప్పిన నాయకుడిగా పీవీ నరసింహారావుకు ఈ దేశ ప్రస్థానంలో కీలకమైన స్థానం ఉంది. 1991లో దేశం క్లిష్ట పరిస్థితుల్లో ఉన్నప్పుడు, ఆయన ప్రధానిగా బాధ్యతలు స్వీకరించారు. ఆర్థికరంగ నిపుణుడు డాక్టర్ మన్మోహన్ సింగ్ను ఆర్థిక మంత్రిగా నియమించారు పీవీ నరసింహారావు. పండితుడు, రాజనీతిజ్ఞుడు అయిన పీవీ నరసింహారావు దేశానికి పలు హోదాల్లో సేవలు అందించారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా, కేంద్రమంత్రిగా, ఎంపీగా, అసెంబ్లీ సభ్యుడిగా ఎన్నో ఏళ్లు బాధ్యతలు నిర్వర్తించారు పీవీ నరసింహా రావు. దేశం ఆర్థికంగా పురోగమించడానికి ఆయన దార్శనిక నాయకత్వం ఉపయోగపడింది. దేశాభివృద్ధికి పీవీ నరసింహారావు పటిష్ఠమైన పునాదులు వేశారు. సరళీకరణ విధానాలతో ప్రపంచ మార్కెట్లకు పీవీ తలుపులు తెరిచారు. భారత విదేశాంగ విధానానికి, భాషకు, విద్యారంగానికి ఆయన సేవలు అపారమైనవని భారత రత్న ప్రకటించిన సందర్భంగా ప్రధాని మోదీ కొనియాడారు.

## పోలీస్ శాఖలో ఏం జరుగుతోంది

కుమారుడిని తప్పించిన కేసు, ఫోన్ ట్యాపింగ్ కేసు, విధినిర్వహణలో అలసత్వం ఇలా తెలంగాణ పోలీస్ శాఖకు చెరగని మచ్చ తెచ్చిపెట్టాయి. మామూలు పోలీస్ నుంచి ఉన్నతాధికారుల వరకు సస్పెండ్, అరెస్టులు, ఏకంగా జైలు పాలవుతున్నారు. అసలు తెలంగాణ పోలీసు శాఖలో ఏం జరుగుతోందన్న చర్చ మొదలైంది..!క్రమ శిక్షణకు మారుపేరుగా చెప్పుకునే పోలీస్ శాఖలో కొందరి తీరు కంచే చేను మేసిన చందంగా మారుతోంది. ఉన్నతాధికారుల హెచ్చరికలు, సస్పెన్షన్ చర్యలను కొందరు పోలీసులు పెడచెవిన పెడుతున్నారు. ఇంకొందరు బినామీ పేర్లతో కోట్లు గడిస్తూ దర్జాగా కాలం వెళ్ళదీస్తున్నారు. దొరికితే దొంగ.. లేదంట దొర అన్నట్లుగా మారింది. ఈ క్రమలో పలు వివాదాల్లో చిక్కుకున్న పోలీసులు సస్పెన్షన్ వేటుకు గురవుతున్నారు. దీంతో ఆ శాఖలో పెద్ద ఎత్తున ఖాళీలు విపరీతంగా ఏర్పడుతున్నాయి.మహిళపై అత్యాచారం చేసిన కేసులో అప్పటి టాస్కోర్స్లో పని చేసిన మారేడుపల్లి ఇన్స్పెక్టర్ నర్సింగ్ రావు సస్పెన్షన్ వేటుకు గురై అరెస్ట్ అయిన సంగతి తెలిసిందే! ఇక మాజీ ఎమ్మెల్యే షకీల్ కొడుకు కేసులో లక్షల రూపాయల లంచం తీసుకుంటూ పంజాగుట్ట ఇన్స్పెక్టర్ దుర్గారావు ఉద్యోగం పోగొట్టుకున్నారు. డ్యూటీలో నిర్లక్ష్యం సివిల్ మ్యాటర్లో తలదూర్చి సైబరాబాద్, హైదరాబాద్ కమిషనరేట్ పరధిలోని పలు పోలీస్ స్టేషన్లలో పని చేసిన సీఐలు, ఎస్ఐలు అధికారుల ఆగ్రహానికి గురై ఇంటి బాటపట్టారు.ఇక ఫోన్ ట్యాపింగ్ కేసు అందరికి తెలిసిందే..! పోలీస్ అధికారి ప్రణీత్ రావు అరెస్ట్ నుండి మొదలుకుని, అడిషనల్ ఎస్పీలు భుజంగరావు, తిరుపతన్న జైలు పాలయ్యారు. తాజాగా ఆ లిస్టులోకి మాజీ టాస్కోర్స్ డీసీపీ రాధాకిషన్ చేరారు. ఈ కేసులో ఇంకా చాలా మంది పోలీస్ అధికారులు ఉన్నట్లు తెలుస్తోంది. దర్యాప్తులో ఒక్కో పోలీస్ అధికారి విషయాలు బయటకు రావడంతో తెలంగాణలో అనేక ప్రాంతాల్లో ప్రస్తుతం డ్యూటీలో ఉన్న పోలీస్ బాస్ లు విచారణ ఎదురుకుంటున్నారు. ఇంకా ఎంత మంది అధికారులు అరెస్ట్ అవుతారో అర్థం కాని పరిస్థితి నెలకొంది.తాజాగా నయీమ్ కేసుపై కూడా పోలీస్ ఉన్నతాధికారులు ఫోకస్ పెట్టినట్లు తెలుస్తోంది. ఇక ఈ కేసు కూడా ఇన్వెస్టిగేషన్ మొదలైతే చెప్పాల్సిన పని లేదు.. అప్పట్లో నయీమ్తో చెట్టాపట్టాలేసుకుని అక్రమ ఆస్తులు కూడాబెట్టారన్న ఆరోపణలు ఎదుర్కొంటున్న వారికి కష్టకాలమేనట. సస్పెండ్కు గురై మళ్ళీ క్లిన్ చిట్ తో డ్యూటీలో జాయిన్ అయిన అధికారులను మరోసారి విచారించేందుకు పోలీస్ యంత్రాంగం సిద్ధమవుతుందట. ఇలా అనేక అవినీతి, నేర కేసుల్లో పోలీస్ బాసులు జైలుకు వెళ్లడం, జాబ్ పోగొట్టుకోవడం కలవరానికి గురి చేస్తోంది. దీంతో ఆయా పోస్టులకు ఖాళీలు కూడా ఏర్పడుతోంది. భవిష్యత్తులో పోలీస్ శాఖ ఇంకా ఎంత అప్రతిష్ట మూట కట్టుకుంటుందో అని జనం విమర్శలు గుప్పిస్తున్నారు. వడ్డించే వాడు మనవాడు అని తెలిసి అడ్డగోలుగా తింటే అజీర్తి అవ్వడం ఖాయం అంటూ మరికొందరు కరెప్టెడ్ పోలీసులపై కామెంట్లు చేస్తున్నారు.

## వేసవిలో త్రాగు నీటి ఎద్దడి నివారణకు చర్యలు

ఆదేశించారు. శనివారం జిల్లా కలెక్టర్ కార్యాలయం లోని సమావేశ మందిరంలో వేసవిలో త్రాగు నీటి ఎద్దడి నివారణకు చేపట్టిన చర్యలు, వివిధ దశలలో ఉన్న పనుల పురోగతి పై ఆర్.డబ్లూ.ఎస్, గ్రిడ్, మండల ప్రత్యేక అధికారులు, ఎం.పీ.డి.ఓ లతో గ్రామ పంచాయితీల వారీగా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా మాట్లాడుతూ జిల్లాలోని 241 గ్రామ పంచాయితీలలో వేసవిలో నీటి ఎద్దడి నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టడం జరిగిందని తెలిపారు. సుదీర్ఘ సమీక్ష నిర్వహించిన జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా గ్రామ పంచాయతి వారిగా పంచాయతి రాజ్, ఆర్ డబ్ల్యూఎస్ అధికారులను మంచినీటి సరఫరా వివరాలను అడిగి తెలుసుకున్నారు.

గ్రామాలలో మరమ్మత్తులలో ఉన్న బోర్లు, చేతి పంపులు, మంచినీటి పైపులైన్లు లీకేజి మరమ్మత్తులు, నూతన పైపు లైన్ల నిర్మాణానికి ప్రత్యేక అభివృద్ధి నిధులు (ఎస్.డి.ఎఫ్) డి.ఎం.ఎఫ్.టి నిధుల నుండి అన్ని గ్రామ పంచాయితీలకు 3.91 కోట్లు మంజూరు చేసినట్లు తెలిపారు. మంచినీటి ఎద్దడి సమస్య పరిష్కారానికి పంచాయతి రాజ్, ఆర్ డబ్ల్యుఎస్ అధికారులు అందచేసిన నివేదికలు ఆధారంగానే నిధులు మంజూరు చేశామని అన్నారు. ఎక్కడైనా మంచినీటి సరఫరాలో ఇబ్బంది వస్తే తక్షణమే తన దృష్టికి తేవాలని తెలిపారు. వేసవిలో నీటి సరఫరాలో ఇబ్బందులు ఎదురైనప్పుడు ప్రత్యాన్మయ ఏర్పాట్లుతో నీటి సరఫరాకు సిద్ధంగా ఉండాలని తెలిపారు. మంచినీటి వనరులు మాత్రమే కాకుండా ప్రైవేటు బోర్లు, బావుల ద్వారా గ్రామాలలో నీటిని అందించడానికి సిద్ధంగా ఉండాలని పేర్కొన్నారు. గ్రామాలలో ప్రైవేటు బోర్లు, బావులు ఇతర నీటి వనరుల వివరాలు సేకరించి నివేదికలు అందుబాటులో ఉంచుకోవాలని, అత్యవసర పరిస్థితులలో వాటి ద్వారా గ్రప్రజలకు నీటిని సరఫరా చేయాలని అన్నారు. గ్రామాలలో ప్రజల అవసరాలకు ఎన్నిలీటర్ల నీరు అవసరం, గ్రామంలో ఉన్న ఓ హెచ్ఎస్ఆర్ వాటర్ ట్యాంకుల సామర్థ్యం ఎంత, ఎన్ని గంటలు బోర్లు నుండి ట్యాంకులు నింపవచ్చు, అనే అంశాలపై ప్రతి గ్రామ పంచాయితీ కార్యదర్శికి సమగ్రమైన అవగాహన ఉండాలని తెలిపారు. గ్రామాలలో మరమ్మతులు జరుగుతున్న బోర్లు, చేతి పంపులను ఏప్రిల్ 04వ తేదీ వరకు పూర్తి చేసి నివేదికలు అందచేయాలని, ఎక్కడైనా మరమ్మత్తులు పూర్తికాకపోతే అందుకు కారణాలను ఎంపిడిఓ, ఆర్ డబ్ల్యూఎస్ సిబ్బంది సంయుక్తంగా దృవీకరణతో నివేదికలు అందచేయాలని ఆదేశించారు. వేసవి కాలం ముగిసేంత వరకు అధికారులు అత్యంత అప్రమత్తంగా ఉండాలని ఎక్కడా త్రాగునీటికి ఇబ్బంది రావొద్దని ఆయన పేర్కొన్నారు. పురోగతిలో ఉన్న పనులను యుద్ధ ప్రాతిపదికన నిర్దేశిత సమయంలోగా పూర్తి చేయాలని, మరమ్మత్తులకు వినియోగించే సామగ్రి నాణ్యత ఉండాలని తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, అసిస్టెంట్ కలెక్టర్ ఉమా శంకర్ ప్రసాద్, జడ్పీ సిఈఓ విజయలక్ష్మి, ఆర్.డబ్లూ.ఎస్ ఈఈ నిర్మల, డి.పి.ఓ నారాయణరావుతో పాటు మండల ప్రత్యేక అధికారులు, ఎం.పీ.డి.ఓలు, ఆర్. డబ్లూ.ఎస్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

నెంబర్ గేమ్ రాజకీయాలు...
ఆత్మగౌరవం భావోద్వేగాలతో ఉద్యమం పోరాటాల పునాదుల మీద సాధించుకున్న తెలంగాణ రాష్ట్రంలో రాజకీయ వలసలు మారుతున్న సమీకరణాలపై 'జయభేరి' సగర్వంగా అందిస్తున్న కౌంటర్ విత్ కడారి శ్రీనివాస్ రాజకీయ సమగ్ర విశ్లేషణ....

# ఏది భావజాలం ఎక్కడ పోయింది సిద్ధాంతం...

జయభేరి, హైదరాబాద్ :



వలసలు వచ్చిన వాళ్లకే ఆ పార్టీలో కీలక పదవులు.. రాజకీయ వలసలు ఇంకా పెరిగే అవకాశాలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. రాజకీయ వలసలను ప్రోత్సహిస్తున్న పార్టీలను భూస్థాపితం చేయాల్సిందే. సిగ్గు ఎగ్గు లేకుండా ఒంటిమీద మురికిని మార్చినట్లుగా రాజకీయ పార్టీలు మారుతున్న నేతలను చూస్తే రోజు రోజుకు ప్రజాస్వామ్యం పూర్తిగా ఏమైపోతుందో అన్న భావన కలుగుతుంది. తెలంగాణ ఉద్యమం ఏర్పడింది దేనికోసం!? రాష్ట్రం సాధించుకున్నది ఎవరికోసం? ఆత్మ గౌరవం కోసం మన పాలన మనమే చేసుకుందామని ఆలోచనలతో తొలి తెలంగాణ ఉద్యమంలో అసువులు బాసిన వందలాది మంది మొదలుకొని మలి తెలంగాణ ఉద్యమంలో వందల మంది వేల మంది ప్రాణాల త్యాగ ఫలితం రాష్ట్రం ఏర్పడితే ఈ రాష్ట్రంలో బాగుపడింది ఎవరు? మా రాష్ట్రం మాకొస్తే మా పాలనమేం చేసుకుంటే మా ఉద్యోగాలు మాకు వస్తాయి మా నిధులు మాకు దక్కుతాయి అన్న ఆలోచనలతో రాష్ట్రం కోసం పనిచేసిన అన్ని వర్గాలు ఇవ్వాలా తలవంచుకునే బతుకుతున్నాయి. ఆత్మగౌరవ నినాదంతో తెలంగాణ రాష్ట్రం ఏర్పడితే కనీసం ఆ ఆత్మ గౌరవాన్ని నిలబెట్టే పార్టీ ఒక్కటన్నా ఉంద అంటే అనుమానమే!? తెలంగాణ ఉద్యమంలో ప్రాణాలర్పించిన త్యాగధనులు ఈ వలసల ఆధ్యాంతాన్ని చూస్తే వాళ్ల ఆత్మ ఘోషించదా? ఏదైనా రాజకీయ పార్టీకి ఒక సిద్ధాంతం ఆత్మ అభిమానం ఒక ఎజెండా ఉంటుంది. కానీ నేటి రాజకీయాల్లో ఏ పార్టీకి కూడా ఏక సిద్ధాంతం లేకుండా వాళ్ళు చేశారు మేం చేస్తే తప్పు అన్న ఆలోచనలతో సిగ్గు ఎగ్గు లేకుండా వలసలు వస్తున్న నేతలు ఒకవైపు వలసలను ఆహ్వానిస్తూ వారికి పెద్ద పీటలు వేస్తున్న పార్టీలు ఒకవైపు.. మొత్తానికి మేము చేస్తే వ్యభిచారం మీరు చేస్తే సంసారమా అన్న చందాన రాజకీయ వలసల ప్రవేశం జరుగుతోంది.

**ఆత్మ అభిమానం ఆత్మగౌరవం సిద్ధాంతం ఎజెండా ఇవన్నీ పక్కనపెట్టి ఎలాగైనా అధికారంలో ఉన్న పార్టీ పంచన చేరితే మళ్ళీ అధికారం తక్కువవచ్చు సంపాదించుకున్న అక్రమంగా దోచుకున్న ఆస్తులను ధనాన్ని కాపాడుకోవచ్చు అనే నెపంతోటే నేతలు తమ రాతలు మార్చుకుంటున్నారు కానీ ప్రజల జీవితాల్లో మార్పులు తీసుకురాలేకపోతున్నారు. రాజకీయ రంగంలో కండువాలు మారుస్తున్న నేతలను చూస్తూ వారికే ఓటు వేసి ప్రజాప్రతినిధులుగా నిలబెడుతున్నారు. ఆత్మగౌరవమా అది ఎక్కడ ఉంటుంది ఎంతకు దొరుకుతుంది అనే సమాజాన్ని మనం భవిష్యత్తులో చూస్తామేమో నన్న భయం కూడా కలుగుతుంది. సిద్ధాంతాలు అవి ఎలా ఉంటాయి ప్రజలకు సంక్షేమ అభివృద్ధి కావాలి కదా అనే నెపంతోటే వలసలు వెళ్లి అధికార పార్టీలోకి వస్తుందని నేతలను చూస్తే తలపండిన జుట్టు మెరిసిన నేతలే సిగ్గు ఎగ్గు లేకుండా కండువాలు మారుస్తున్నారు. నెంబర్ గేమ్ రాజకీయాలను చూస్తుంటే ప్రజాస్వామ్యంలో ప్రజల సంక్షేమం అభివృద్ధి పక్కన పెట్టి మాకు ఎంత బలం ఉంది అని నిరూపించుకునే దిశగా అడుగులు వేస్తున్న పార్టీలను కడిగి పడేయాలనిపిస్తోంది.**

2014 తెలంగాణ ఉద్యమంలో రాజకీయ పార్టీగా అవతరించిన తెలంగాణ రాష్ట్ర సమితికి 66 సీట్లు ఇచ్చి మంచి నెంబర్ను ప్రజలు అందించిన అవిశాలదన్నట్టు ఆనాడు వలసలకు ప్రేరేపించింది టిఆర్ఎస్ పార్టీ. ఆ తర్వాత 2018 ఎలక్షన్ లో కూడా ప్రజలు ఇదే టీఆర్ఎస్ పార్టీకి 88 సీట్లు ఇస్తే ఆశ చావని రాజకీయ పార్టీ ఆనాడు కాంగ్రెస్ పార్టీలో ఉన్న దాదాపు 12, 15 మంది ఎమ్మెల్యేలను పూర్తిగా తమ పార్టీలోకి ఆహ్వానించుకుంది ఆనాటి టిఆర్ఎస్ పార్టీ. చరిత్ర పునరావృతం అవుతుంది కదా అన్న సూక్తికి నిదర్శనంగానే నేడు టిఆర్ఎస్ గా అవతరించిన పార్టీ నామరూపాలు లేకుండా పోయే స్థితికి చేరుకుంది అంటే తాను తవ్వుకున్న గోతిలో తానే పడింది. నేటి తాజా రాజకీయ రణరంగంలో దాదాపు 41 మంది కండువాలు మార్చుకున్నట్టుగా తెలుస్తోంది. ఇలా కండువాలు మార్చుకొని పార్టీ మారిన నేతలకు ఏకంగా ఎంపీ టికెట్ ఇస్తున్న కాంగ్రెస్ పార్టీ భవిష్యత్తులో కూడా భారీ మూల్యం చెల్లించుకొనుంది. ఎందుకంటే పదేళ్ల కెసిఆర్ ప్రభుత్వంలో ప్రతి సమస్యను ఎత్తిపెట్టిన ప్రతిపక్ష కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షునిగా రేవంత్ రెడ్డి ఆనాడు ఈ నేతలనే కదా దుమ్మెత్తి పోస్తూ అనేక విధాలుగా అవాకులు చవాకులు పేలుతూ అవినీతి బాగోతాన్ని బయట పెడతాం అన్న వాగ్దానాలు కూడా చేసిన ఇప్పటి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఈ నాయకులు కాంగ్రెస్ పార్టీలోకి రాగానే అంత పతివ్రతలు అయిపోయారా!? మొన్నటి వరకు రాష్ట్ర శాసనసభలో కూర్చుని ఇదే రేవంత్ రెడ్డిని కడిగిపడేసిన కడియం శ్రీహరి ఇప్పుడు అంతలా ఆప్తుడు అయిపోయాడు!? కాంగ్రెస్ పార్టీకి మంచి ఫిగర్ ని అందించిన తెలంగాణ ప్రజలు మళ్లీ వలసలను ప్రోత్సహిస్తూ తెలంగాణ సమాజానికి ఏం మెసేజ్ అందిస్తోంది? **ఆత్మగౌరవ భావోద్వేగాలను బలి పెడుతూ తెలంగాణ రాష్ట్రంలో రాజకీయ పార్టీలు సిగ్గు ఎగ్గు లేకుండా పార్టీల కండువాలు మారుస్తూ పార్టీలలో చేరుతుంటే తెలంగాణ సమాజం చూస్తూ ఊరుకుంటుందా!? ఊరుకోక ఏం చేస్తుందిలే వంద నోటుకు బీరు బిర్యానీకు ఓటు వేసి తెల్లారి తమ పనిలో తాము పడిపోతుంది తెలంగాణ సమాజం అనుకుంటే రాజకీయ పార్టీలు నిప్పులు కాలేసినట్టే!? మారుతున్న కాలానికి సమాజం మారుతూ ఉంది కానీ రాజకీయాలు మాత్రం పూర్తిగా వ్యభిచారంగా మారిపోతున్న నేటి తరుణంలో భావోద్వేగాలతో ఆత్మగౌరవంతో తెలంగాణ రాష్ట్రం ఏర్పడితే ఇదే తెలంగాణ రాష్ట్రంలో వీటిని బొందపెట్టి అధికారమే లక్ష్యంగా కండువాలు మారుస్తున్న నేతలను ఆయా ప్రభుత్వాలను కడిగిపడేయాల్సిన బాధ్యత జర్నలిజం ది కాదా!? అందుకే ఇప్పటి ప్రభుత్వానికి జయభేరి కౌంటర్ విత్ కడారి శ్రీనివాస్ గట్టిగా హెచ్చరిస్తున్న విషయం ఒక్కటే.... తెలంగాణ ప్రజలు ప్రభుత్వం ఏర్పాటు చేయడానికి కావలసిన మెజారిటీ సంఖ్యను అందించిన ఇంకా సిగ్గు ఎగ్గు లేకుండా వలసలను ఆహ్వానిస్తూ గత ప్రభుత్వం చేసిన తప్పులనే మళ్లీ ఒక్కొక్కటిగా మొదలు పెడుతున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి ఇది ఘాటైన హెచ్చరిక... గత ప్రభుత్వానికి పట్టిన గతి కంటే మీకు ఇంకా ఎక్కువగా హీనంగా తెలంగాణ ప్రజలు తీర్పు చెప్పే రోజు అంటూ ఒకటి ఉంటుంది గుర్తుపెట్టుకోండి...** తెలంగాణ ప్రజలు ప్రభుత్వానికి కావలసిన సంఖ్యను అందించిన అవిశాలదన్నట్టు ఎంపీ ఎలక్షన్లో ఎలాగైనా కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని నెపంతో వలస వచ్చిన వాళ్లకే ఎంపీ టికెట్ను అందిస్తూ లబ్ధి పొందాలనుకునే మీలాంటి నీచ నికృష్ట రాజకీయాలను ప్రజలు క్షమించరు... రక్షా పాలనకు శ్రీకారం చుడుతున్నామని మొదట్లో నాలుగు అడుగులు ముందుకు వేసి వంద అడుగులు అవినీతి బాగోదానికి తెరతీస్తున్నారు. ఇది మంచి పద్ధతి కాదు రాజకీయంగా మీకు సమాధి కట్టే రోజును ప్రజలు లెక్క పెడుతున్నారు.

**ప్రతిపక్షాన్ని లేకుండా చేయాలనుకునే మీ బుద్ధికి ప్రజలు కనీసం 10 ఏళ్లు పరిపాలన చేసిన పార్టీని ప్రతిపక్షంలోనైనా కూర్చోబెట్టారు కానీ ఐదేళ్లకే మిమ్మల్ని ప్రతిపక్షంలో కూడా లేకుండా చేసే దుర్భరమైన తీర్పును తెచ్చుకోకండి... ఇది తెలంగాణ సమాజం హెచ్చరిస్తున్న హెచ్చరిక.. రాజకీయాలు ఆరోగ్యకరంగా ఉండాలి కానీ తెలంగాణ రాష్ట్రంలో ఆత్మ గౌరవంతో భావోద్వేగంతో ఒక ఉద్యమ పార్టీగా ఏర్పడ్డ టిఆర్ఎస్ పార్టీ చేసిన తప్పుకు పరితాపం చెందుతున్న ఈ తరుణంలో అధికారం కోల్పోయిన పది సంవత్సరాల్లో తిరిగి ప్రజలు క్షమించి అధికారం ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ అదే తప్పును చేస్తుంటే తెలంగాణ సమాజం తెలంగాణ ప్రజలు నిలువునా కాంగ్రెస్ పార్టీని భూస్థాపితం చేయక తప్పదు... ఎన్నికలు వస్తుంటాయి పోతుంటాయి గెలుపోటములు ఉంటాయి పోతాయి అంతేకానీ గెలుపే లక్ష్యంగా స్వార్థంతో అడిగేసిన ఏ పార్టీ రాజకీయ చరిత్రలో మనుగడ కొనసాగించలేదు ఇది గుర్తుపెట్టుకోండి.**

తెలంగాణ అంటేనే భావోద్వేగాల మధ్య ఆత్మగౌరవంతో తలెత్తుకొని నిత్యం పోరాటాల పురిటి గడ్డను తలపించేలా ఉద్యమ కెరటాలతో నీతి నిజాయితీని పెట్టుబడిగా పెట్టి ఏళ్ళ తరబడి ఉద్యమాన్ని కొనసాగించి ప్రాణాలు తీయకుండా ప్రాణాలు తీసుకొని ఆత్మ బలిదానాలతో తెలంగాణ రాష్ట్రం సంపాదించుకుంది ఇలాంటి రాక్షస రాజకీయ నాయకుల కోసమా!? తెలంగాణలో మసలుతున్న రాజకీయ పార్టీలరా బహుపరాక్ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కాంగ్రెస్ పార్టీకి రానున్న రోజుల్లో కచ్చితంగా ప్రజలు తీర్పు చెప్పటానికి బాగానే ఒక్కొక్క విషయాన్ని పరిగణలోకి తీసుకుంటున్నారు?



కడారి శ్రీనివాస్
కాలమిస్ట్, సీనియర్ జర్నలిస్ట్, కవి, రచయిత
గాయకులు, సామాజిక ఉద్యమకారులు

# పొంచి ఉన్న నీటి గండం

▶▶ సమ్మర్ కు ముందే త్రాగు నీటి కష్టాలు

జయభేరి, హైదరాబాద్, మార్చి 30:

వేసవి ప్రారంభంలోనే తెలంగాణలో తాగు, సాగు నీటి కష్టాలు మొదలయ్యాయి. సాగుకు నీళ్లు అందక పొలాలు ఎండిపోతున్నాయి. ఇక ప్రధాన నగరాల్లో తాగు నీటి ఇబ్బందులు మొదలయ్యాయి. ప్రజలు నీటి ట్యాంకర్లపై ఆధారపడుతున్నారు. కర్ణాటకలో నీటి కష్టాలు తీవ్రంగా ఉన్నాయి. ఆ రాష్ట్ర రాజధాని బెంగళూరులో అయితే తాగునీటికి మరింత ఇబ్బంది పడుతున్నారు ప్రజలు. భూగర్భ జలాలు అడుగంటిపోతుండడంతో... అధికంగా నీళ్లు వినియోగిస్తే ప్రభుత్వం జారిమానా విధించే స్థాయికి వచ్చిందంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. కృష్ణా నది తీరంగా క్రాఫ్ హాలీడే ప్రకటించారు. ఎగువ నుంచి కృష్ణా నదికి నీరు రాకపోవడంతో తెలంగాణలో నీటి సమస్యలుఉద్ధృతం అవుతున్నాయి. గోదావరి పరీవాహకంలో సైతం ఇలాంటి పరిస్థితులే నెలకొన్నాయి.గత ఏడాది వర్షాలు బాగానే కురిసినా.... జలాశయాలు, డ్యాంలు, చెరువుల్లో నీటిమట్టం క్రమంగా తగ్గిపోతుంది.కాలువ నుంచి నీరు అందకపోవడంతో రైతులు బోర్లపైనే ఎక్కువ ఆధారపడుతున్నారు. దీంతో ఉపరితల జలవనరులు తగ్గిపోతున్నాయి.



ఎండలు తీవ్రంగా ఉండడంతో జలశయాల్లో నీటి వనరులు తగ్గడానికి ఓ కారణంగా కనిపిస్తోంది. వేసవిలో సాధారణం కంటే నీటి వినియోగం ఎక్కువగా ఉంటుంది. పైగా ఎండల తీవ్రతకు నీటి వనరులు తగ్గుతుంటాయి. తెలంగాణలో ప్రస్తుతం నీటి సమస్యలుప్రారంభం అయ్యాయి. రాష్ట్రంలో నీటి వినియోగం భారీగా పెరుగుతోంది. జలశయాల్లో నీరు తగ్గుతుండడంతో... అధికారులు తాగునీటికి ప్రాధాన్యం ఇస్తున్నారు. దీంతో సాగుకు నీరు అంతంత మాత్రంగానే అందుతోంది. దీంతో పంటలు సాగు చేసిన రైతులు...బోర్లపై ఆధారపడుతున్నారు.కృష్ణా నదిపరీవాహకంలో ఈ ఏడాది వర్షాలు తగినంత పడలేదు. దీంతో ఎగువ నుంచి వచ్చే నీటి ప్రవాహం తగ్గింది. ఎగువ నుంచి జూరాలకు 154 టీఎంసీలు, శ్రీశైలానికి 115 టీఎంసీలు మాత్రమే వచ్చాయి. నారాయణపూర్ జలశయంలో ప్రస్తుతం 20 టీఎంసీలు నిల్వ ఉండగా.... వేసవి నీటి ఎద్దడిని తట్టుకునేందుకు తెలంగాణకు కనీసం 5 టీఎంసీలు నీరు దిగువకు విడుదల చేయాలని కర్ణాటకను( కోరాలని తెలంగాణ ప్రభుత్వం నిర్ణయించింది. జూరాల జలాశయంలో నీళ్లు అడుగంటుతున్నాయి. జూరాల కింద పంటలు ఎండిపోతున్నాయి. వానాకాలం తర్వాత కర్ణాటక నుంచి జూరాలకు కనీసంర 2.5 టీఎంసీల నీరు వచ్చేది కానీ ఈ ఏడాది నీరు రాలేదు. దీంతో జూరాలలో నీటి మట్టం క్రమంగా తగ్గుతోంది.కాళేశ్వరం ఎత్తిపోతల ప్రాజెక్టు మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల్లో లోపాల కారణంగా... ఈ ప్రాజెక్టుల్లో నీటిని ఖాళీ చేశారు. మేడిగడ్డ పిల్లర్లుకుంగడంతో...నీటిని దిగువకు వదిలేస్తున్నారు. అన్నారం బ్యారేజీలోనూ బుంగల కారణంగా నీటిని దిగువకు వదిలేశారు. ప్రస్తుతం ఎత్తిపోతలు నిలిచిపోవడంతో...ఎల్లంపల్లి, మిడ్, లోయర్ మానేరుల్లో నీటి మట్టాలు అడుగంటాయి. గత కొన్ని రోజులుగా ఈ జలాశయాల కింద సాగు, తాగునీటి అవసరాలకు పెద్దఎత్తున నీటిని వినయోగిస్తున్నారు. శ్రీరామసాగర్, మిడ్ మానేరు, లోయర్ మానేరు(నుంచి నీటి వినియోగం పెరిగింది. ఈ ప్రాజెక్టుల పరిధిలో నీటి సమస్యలు తలెత్తున్నాయి. తెలుగు రాష్ట్రాలకు కీలకమైన శ్రీశైలం ప్రాజెక్టులో కూడా నీటి మట్టం వేగంగా తగ్గిపోతుంది. నదిలో ఇసుక మేటలు కనిపిస్తున్నాయి. శ్రీశైలం జలాశయంలో ప్రస్తుత నీటి మట్టం 810.80 అడుగులకు చేరుకుంది. నాగార్జునసాగర్ తో కూడా నీటి మట్టాలు వేగంగా తగ్గుతున్నాయి. హైదరాబాద్, కరీంనగర్, యాదాద్రి సహా పలు జిల్లాల్లో తాగునీటికి ప్రజలుఇబ్బంది పడుతున్నారు. భూగర్భజలాలు తగ్గిపోవడంతో...తగినంత తాగునీరు దొరక్క నగరాల్లో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వేసవి ఆరంభంలోనే ఎండలు తీవ్రంగా ఉండడంతో నీటి సమస్యలు తలెత్తుతున్నాయని అంటున్నారు. మార్చి నెల నాటికే భూగర్భజలాలు గణనీయంగా తగ్గిపోయాయి. చెరువులు, కాలువలు ఎండిపోతుంటే...నదుల్లో సైతం నీరు వేగంగా తగ్గిపోతుంది. ఉపనదుల్లో చుక్క నీరు కనిపించడలేదు. తెలంగాణ వ్యాప్తంగా 142 పట్టణాల్లో నీటి లభ్యత గణనీయంగా తగ్గిందని అధికారులు అంటున్నారు. మార్చి నాటికే పరిస్థితి ఇలా ఉంటే ఇక రాబోయే రెండు నెలల్లో తాగునీటి సమస్యలు తీవ్రం అవుతాయని పట్టణ వాసులు ఆందోళన చెందుతున్నారు. ఏప్రిల్, మే నెలల్లో తాగునీటి సమస్యలు తీవ్రం కాకముందే క్షేత్రస్థాయి సిబ్బంది అప్రమత్తం చేసింది.

# స్థానికేతరులు గెలుసుడు.. అభివృద్ధిని మరుసుడు...

- జాతీయ పార్టీలైన బీజేపీ, కాంగ్రెస్ లు మతం పేరుతో ఒకరు, అబద్ధపు హక్కు హామీలతో ఇంకొకరు ప్రజలను మోసం చేస్తున్నాయి...
- బిజెపి, కాంగ్రెస్ అభ్యర్థులు అసలు స్థానికులే కాదు... వారికి మల్కాజ్గిరి పార్లమెంట్ లోని సమస్యలపై ఏమి అవగాహన ఉంది....
- గత ఎన్నికల్లో కొడంగల్ ప్రజల చేతిలో ఓడిన రేవంత్ రెడ్డి మల్కాజ్గిరి లో గెలిచి చేసింది ఏమిటి...?
- మన అభ్యర్థి గెలుపుతోనే మన ప్రాంత అభివృద్ధి, సంక్షేమం సాధ్యం...
- 125 - డివిజన్ ఉషోదయ కాలనీలో నిర్వహించిన పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో ప్రతిపక్షాలపై ఎమ్మెల్యే కేపీ. వివేకానంద వ్యాఖ్యలు...

**జయభేరి, గాజులరామారం :**

మల్కాజిగిరి పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం 125 గాజులరామారం డివిజన్ ఉషోదయ కాలనీలో ఎమ్మెల్యే కేపీ. వివేకానంద ఆధ్వర్యంలో బిఆర్ఎస్ పార్లమెంట్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కేపీ. వివేకానంద మాట్లాడుతూ.. కొడంగల్ లో ఓడి గత పార్లమెంట్ ఎన్నికల్లో మల్కాజిగిరిలో గెలిచిన రేవంత్ రెడ్డి పార్లమెంట్ నియోజకవర్గానికి ప్రత్యేక నిధులు ఎంత వెచ్చించారో ప్రజలకు తెలియజేయాలి. స్థానికంగా ఓడిన నేతలు స్థానికేతర ప్రాంతాలైన మల్కాజ్గిరి పార్లమెంట్ నియోజకవర్గంలో గెలవడం, అభివృద్ధిని మరవడం పరిపాటిగా మారింది. గత పదేళ్ల కాలంలో నగరాభివృద్ధి కేవలం బిఆర్ఎస్ ఎమ్మెల్యేలతోనే జరిగిందని, ఒక్క రూపాయి కూడా ఎంపీ నిధుల నుంచి వెచ్చించి అభివృద్ధి చేసిన పాపాన ఈ జాతీయ పార్టీలైన కాంగ్రెస్, బిజెపిలు పోలేదన్నారు. అసలు హుజురాబాద్ లో ఓడిన ఈటల రాజేందర్ కు, చేవెళ్ల వాస్తవు రాలైన పట్నం సునీతా మహేందర్ రెడ్డిలకు మల్కాజ్గిరి తో ఏం సంబంధం...? అసలు వాళ్లకు మల్కాజ్గిరి లోని సెగ్మెంట్లలో నెలకొన్న సమస్యలపై అసలు అవగాహనే లేదన్నారు. మరో మారు వీళ్లను గెలిపిస్తే హెలికాప్టర్లలో వచ్చి హాయ్... భాయ్ లు చెప్పి వెళ్లిపోతారే గాని ప్రజా సమస్యలను పరిష్కరించే సత్తా ఈ రెండు పార్టీలకు, ఆ పార్టీ నాయకులకు లేవన్నారు.

అదే టిఆర్ఎస్ పార్టీ అభ్యర్థి రాగిరి లక్ష్మారెడ్డి స్థానికుడు, మన మధ్య ఉంటూ మన అభివృద్ధి కోసం పనిచేసే వ్యక్తి... ఇప్పటికే గత 20 ఏళ్లుగా ఎన్నో సంక్షేమ కార్యక్రమాలతో ప్రజల్లో ఉన్న నాయకుడు రాగిడి లక్ష్మారెడ్డిని గెలిపిస్తే కేంద్రంతో కొట్లాడి మరిన్ని నిధులు తెస్తాడని... మన ప్రాంతం మరింత అభివృద్ధి చెందుతుందన్నారు.





అనంతరం మల్కాజ్గిరి బిఆర్ఎస్ పార్లమెంట్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ.. గత 20 ఏళ్లగా నేను ప్రజా క్షేత్రంలో ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు చేపడుతూ నిత్యం ప్రజల్లోనే ఉన్నానన్నారు. వివేకన్నను దీవించి రాష్ట్రంలోనే భారీ మెజార్టీతో ఎలా గెలిపించారో... మరో మారు నన్ను నీ సోదరుడిగా ఇంట్లో కుటుంబ సభ్యుడిగా భావించి దీవించి భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. అదేవిధంగా ఇంట గెలవక రచ్చ గెలవాలనుకునే నాయకులకు ప్రజలు రానున్న ఎన్నికల్లో సరైన బుద్ధి చెప్పి ఇంటికి పంపించాలన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్, రావుల శేషగిరి, పాక్స్ డైరెక్టర్ పరిశె శ్రీనివాస్ యాదవ్, డివిజన్ అధ్యక్షులు విజయరామ్ రెడ్డి, మేడ్చల్ జిల్లా గ్రంధాలయ మాజీ చైర్మన్ నాగరాజు యాదవ్, సీనియర్ నాయకులు కస్తూరి బాల్ రాజ్, అడ్వకేట్ కమలాకర్, చిన్న చౌదరి, గోవర్ధన్ రెడ్డి, మహేష్, నవీన్, ప్రవీణ్, సంక్షేమ సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



## పీఏపల్లి ఎంపీపీ వంగాల ప్రతాపరెడ్డి పై పెట్టిన అవిశ్వాస తీర్మానం వీగిపోయింది



**జయభేరి, పీ ఏ పల్లి :**

పీఏ పల్లి మండల ఎంపీపీ వంగాల ప్రతాప్ రెడ్డి పై పెట్టిన అవిశ్వాసం శనివారం విరిగిపోయిందని దేవరకొండ ఆర్డిఓ శ్రీరాములు తెలిపారు. పీఏ పల్లి మండలంలో మొత్తం 14 ఎంపిటీసీ స్థానాలు ఉండగా అందులో ఏడు కాంగ్రెస్ మరో ఏడు బిఆర్ఎస్ కు అనుకూలంగా ఉన్నాయి. శనివారం పెట్టిన అవిశ్వాసానికి ఏ ఒక్కరు రాకపోవడంతో వంగాల ప్రతాపరెడ్డి పై పెట్టిన అవిశ్వాసం వీగిపోయింది అని స్థానిక ఆర్డిఓ విలేకరుల సమావేశంలో తెలిపారు.

## టెలిగ్రాఫ్ యాక్టుకు అటాచ్డ్...

**జయభేరి, హైదరాబాద్, మార్చి 30 :**

రోజుకో ట్విస్ట్తో తెలంగాణలో సెన్సేషన్ క్రియేట్ చేసిన ఫోన్ ట్యాపింగ్పై ఎట్టకేలకు అధికారికంగా కేసు నమోదయ్యింది. టెలిగ్రాఫ్ యాక్ట్ను అటాచ్ చేస్తూ నాంపల్లి కోర్టులో మెమో దాఖలు చేశారు. దీంతో దేశంలోనే తొలిసారిగా టెలిగ్రాఫ్ యాక్ట్ కింద కేసు నమోదవ్వడం హాట్ టాపిక్గా మారింది.కొత్త కొత్త కోణాలు, పెను సంచలనాలు సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసుపై ముమ్మర దర్యాప్తు జరుగుతోంది. దొరికిన ఏ ఒక్క ఆధారాన్ని వదలిపెట్టకుండా విచారణ కొనసాగిస్తున్నారు అధికారులు. అయితే లేటెస్ట్గా ఫోన్ ట్యాపింగ్పై అధికారికంగా కేసు నమోదవ్వడం.. దేశంలోనే టెలిగ్రాఫ్ యాక్ట్ను అటాచ్ చేసిన తొలి కేసు ఇదే అవ్వడంతో ట్యాపింగ్ వ్యవహారం మరింత సీరియస్ టర్న్ తీసుకుంది. ఈ కేసుపై ముఖ్యమంత్రి రేవంత్రెడ్డి సైతం రియాక్ట్ అయ్యారు. నిందితులకు జైలులో చిప్ప కూడు తప్పదన్నారు. గత ప్రభుత్వం ఫోన్ ట్యాపింగ్తో ప్రజలను భయభ్రాంతులకు గురిచేసిందన్నారు.ఇక కేసు దర్యాప్తులో ప్రణీత్రావుతో పాటు తీవ్ర ఆరోపణలు ఎదుర్కొన్న టాస్క్ ఫోర్స్ మాజీ డీసీపీ రాధాకిషన్ను జడ్జి ముందు హాజరుపరిచారు పోలీసులు. గాంధీ ఆస్పత్రిలో వైద్య పరీక్షల తర్వాత న్యాయమూర్తి ముందు ప్రవేశపెట్టారు. అయితే రాధాకిషన్కు 14 రోజుల జ్యూడిషియల్ రిమాండ్ విధించడంతో చంచల్గూడ జైలుకు తరలించారు. అంతకు ముందు రాధాకిషన్ను అదుపులోకి తీసుకున్న వెస్ట్ జోన్ డీసీపీ విజయ్ కుమార్ ప్రశ్నల వర్షం కురిపించారు. కీలక విషయాలను రాబట్టి స్టేట్మెంట్ రికార్డ్ చేశారు. ప్రణీత్రావుతో ఉన్న సంబంధాలు? ఎంతకాలంగా ఫోన్ ట్యాపింగ్ చేశారు? ఏయే ప్రాంతాల్లో ట్యాపింగ్కు పాల్పడ్డారు? ట్యాపింగ్ సమాచారాన్ని ఎవరికి పంపించారనే కోణంలో విచారించారు.ఇక మొత్తంగా ట్యాపింగ్ కేసులో రేపో ఎల్లుండో కీలక వ్యక్తులు బయటకు వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి.

## దొంగలను పట్టుకున్న శామిర్ పేట్ పోలీసులు

- వ్యవసాయ బావులు, ఇళ్లలో చోరీలకు పాల్పడుతున్న దొంగలు
- నిందితుల వద్ద నుండి ఆటో, సామాగ్రి స్వాధీనం

**జయభేరి, మార్చి 30:**

వ్యవసాయ బావుల వద్ద, నూతనంగా నిర్మిస్తున్న ఇళ్లలో కరెంట్ వైర్లు, బోర్ మోటార్లు, టీవీలు ఇతర సామగ్రిని దోచుకెళ్తున్న దొంగల ముఠా ను శామిర్ పేట్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వీరి వద్ద నుండి ఓ ఆటో, దొంగతనాలకు ఉపయోగించిన సామాగ్రిని స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు శామిర్ పేట్ డిటెక్టివ్ ఇన్స్ స్పెక్టర్ నర్సింహారాజు, స్టేషన్ హౌస్ ఆఫీసర్ ఎస్. శ్రీనాథ్ లు వివరాలను మీడియా కు వెల్లడించారు. నిర్మల్ జిల్లా కు చెందిన షేక్ ఖాదర్, షేక్ ఖయ్యూం, షేక్ నయిమ్, షేక్ మహ్మద్, షేక్ రహీం లు లేబర్ కూలీలుగా నగరానికి వచ్చి పనిచేసుకుంటున్నారు. ఈ క్రమంలోనే జల్సాలకు అలవాటు పడి సులభంగా డబ్బు సంపాదించాలనే ఆశతో చోరీల బాట పట్టారు. ఇందులో భాగంగా రాత్రి వేళల్లో వ్యవసాయ బావుల వద్ద బోర్ మోటార్లు, నూతనంగా నిర్మిస్తున్న ఇళ్లల్లో విద్యుత్ వైర్లు, ఇత్తడి ట్యాప్స్, టీవీలు, గ్యాస్ స్టవ్ లు, సిలిండర్లు, వాహనాల బ్యాటరీలు ఎత్తుకెళ్లి వాటిని విక్రయించి వచ్చిన డబ్బులతో జల్సాలు చేసేవారు. ఈ క్రమంలో నే ఈ చోరీలపై ఫిర్యాదులు రాగ వీటిపై శామిర్ పేట్ పోలీసులు ప్రత్యేక దృష్టి పెట్టారు. ఇందులో భాగంగా గస్తీ నిర్వహించగా ఉప్పర్ పల్లి శివారులోని ఓఆర్ఆర్ సర్వీస్ రోడ్డు నుండి ఓ ఆటోలో కొంతమంది వ్యక్తులు అనుమానస్పదంగా వెళ్తున్నారు.



దీనిపై అనుమానం వచ్చిన పోలీసులు అక్కడికి చేరుకునే క్రమంలో వారిని చూసి పారిపోతుండగా చాకచక్యంగా పట్టుకున్నారు. అనంతరం వారిని స్టేషన్ కు తరలించి విచారించగా సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో 18 దొంగతనాలు చేసినట్లు, అందులో 6 దొంగతనాలు శామిర్ పేట్ పోలీసు స్టేషన్ పరిధిలో చేసినట్లు ఒప్పుకున్నరు. కాగా వీరి వద్ద నుండి దొంగతనాలకు ఉపయోగించిన ప్యాసింజర్ ఆటో, చోరీలకు ఉపయోగించే వివిధ రకాల సామాగ్రిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలిస్తున్నట్లు స్టేషన్ హౌస్ ఆఫీసర్ శ్రీనాథ్, డిటెక్టివ్ ఇన్స్ స్పెక్టర్ నర్సింహ రాజులు తెలిపారు. అదేవిధంగా నిందితులను చాకచక్యంగా పట్టుకున్న సిబ్బందిని అభినందించారు.

## అలా చేస్తే 48 గంటలు చాలు

**జయభేరి, హైదరాబాద్, మార్చి 30**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తమ పార్టీ ఎమ్మెల్యేలను కొనుగోలు చేయాలని చూస్తే 48 గంటల్లో ప్రభుత్వం పడిపోతుందని బీజేపీ శాసనసభా పక్ష నేత మహేశ్వర్ రెడ్డి హెచ్చరించారు. బీజేపీ ఎమ్మెల్యేలు ఎవరూ ఎవరికీ అమ్ముడుపోరన్నారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తే మాత్రం ప్రభుత్వం ఉండదని హెచ్చరించారు. మేం కనుక గేట్లు తెరిస్తే కాంగ్రెస్ పార్టీ ఖాళీ అవుతుందన్నారు. కాంగ్రెస్ ప్రజాస్వామ్యయుతంగా పాలన చేస్తే సహకరిస్తామని స్పష్టం చేశారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఈ లోక్సభ ఎన్నిల్లో బీజేపీ, కాంగ్రెస్ మధ్యనే ప్రధాన పోటీ ఉంటుందన్నారు. తమ ప్రభుత్వాన్ని బీజేపీ కూలగొడతాం అంటే ప్రజలు ఊరుకుంటారా? అని ప్రశ్నించారు. ఇదేమైనా మధ్యప్రదేశ్, మహారాష్ట్ర అనుకుంటున్నారా? అని మండిపడ్డారు. అవసరమైతే బీజేపీకి చెందిన 8 మంది ఎమ్మెల్యేలు కూడా కాంగ్రెస్ పార్టీలోకి వస్తారని కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి చెప్పుకొచ్చారు. ఈ వ్యాఖ్యలపై బీజేపీ ఆగ్రహం వ్యక్తం చేస్తోంది.రేవంత్ రెడ్డి వసూళ్ల చిట్టా తమ వద్ద ఉందన్నారు. హైదరాబాద్ డబ్బులను దేశ రాజకీయాల కోసం కాంగ్రెస్ పార్టీ వినియోగిస్తోందని మండిపడ్డారు. ఓటుకు నోటు కేసులో తన ముఖ్యమంత్రి పదవి పోతుందనే భయం రేవంత్ రెడ్డికి ఉందని విమర్శించారు. సీఎం పదవిపై పదిమంది మంత్రులు కన్నేశారన్నారు.



ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయకుండా ఇతర పార్టీల్లో చేరేవారిని రాళ్లతో కొట్టాలని గతంలో రేవంత్ రెడ్డి అన్నారని గుర్తు చేశారు. అలాంటప్పుడు ఇప్పుడు రాజీనామా చేయకుండానే బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను ఎలా చేర్చుకుంటున్నారు? అని ప్రశ్నించారు. తాను షిండే అవుతానని కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి గతంలో గడ్కరీతో అన్నారని... ఆయన చెప్పింది వాస్తవమేనని... తమ అధిష్ఠానంతో టచ్లో ఉన్నారని చెప్పారు. విచారణల పేరుతో రేవంత్ రెడ్డి వసూళ్లకు పాల్పడుతున్నారని ఆరోపించారు. రేవంత్ రెడ్డి వసూళ్ల చిట్టా తమ వద్ద ఉందని తెలిపారు. ఆర్ట్యాక్స్ కింద రూ.3వేల కోట్లు వసూలు చేశారని ఆరోపించారు. తాను షిండే పాత్ర పోషిస్తానని గతంలో కోమటిరెడ్డి అన్నది వాస్తవమే అన్నారు. తమ్ముడి భార్యకు టిక్కెట్ రాకుండా చేశారని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డిపై ఆరోపణలు గుప్పించారు.ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీలో పెద్ద ఎత్తున చేరికలు ఉన్నాయి. సిట్టింగ్ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు పెద్ద ఎత్తున కాంగ్రెస్ లో చేరబోతున్నారన్న ప్రచారం జరుగుతోంది. బీఆర్ఎస్ ఎల్పీని విలీనం చేసుకుంటారని చెబుతున్నారు. అయితే బీజేపీ ఎమ్మెల్యేలపై మాత్రం ఎలాంటి చర్చ జరగడం లేదు. కొద్ది రోజుల కిందట సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు రేవంత్ రేడిని మర్యాదపూర్వకంగా కలిశారు. అయితే ఆ నియోజకవర్గం నుంచి బీఆర్ఎస్ నేత కోనేరు కోనప్ప కాంగ్రెస్లో చేరడంతో పాల్వాయి హరీష్ బాబు పార్టీ మారే అవకాశం లేదని తేలిపోయింది.



## ఇషా డెంటల్ క్లినిక్ ను ప్రారంభించిన ఎమ్మెల్యే బండారి

**జయభేరి, ఉప్పల్ :**

ఉప్పల్ మెయిన్ రోడ్ శ్రీరామ టెంపుల్ దగ్గర ఇషా డెంటల్ క్లినిక్ ప్రారంబోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే బండారి లక్ష్మా రెడ్డి పాల్గొన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. దంతాలకు సంబందించి ఎటువంటి సమస్యలు చిగుళ్ల వ్యాధి, దంత సమస్యలను నిర్లక్ష్యం చేయకూడదని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో డా.ప్రత్యుష యిల్లేష్ గౌడ్, లింగాల యిల్లేష్ గౌడ్, యం.శ్రీనివాస్, బి.అర్జున్ గౌడ్, ఆకుల మహేందర్, జిట్టా కిషోర్, గోరిజే యిల్లేష్, సాయి రెడ్డి, పి.ప్రవీణ్, కొత్త సంతోష్, సాయి గౌడ్ తదితరులు పాల్గొన్నారు.





శ్రీశ్రీశ్రీ బాల ఆంజనేయా రామలింగేశ్వర స్వామి గణపతి ప్రత్యేక శనైశ్చర ధ్వజప్రతిష్ఠ మహోత్సవ ఆహ్వానా కార్యక్రమం లో పాల్గొన్న ఎమ్మెల్యే బండారి లక్ష్మా రెడ్డి. ఉప్పల్ రింగ్ రోడ్డు, శ్రీశ్రీశ్రీ జగద్గురువులు ఆది శంకరాచార్య హంపి విరూపాక్ష విద్యారణ్య పీఠాదీశ్వరులు శ్రీశ్రీశ్రీ విద్యారణ్య భారతి మహాస్వామి యంత్ర ప్రతిష్ట మహోత్సవ ఆహ్వాన కార్యక్రమానికి ప్రత్యేక పూజలలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ కార్యక్రమం లో దేవాలయ వ్యవస్థాపక ధర్మకర్త ప్రధాన అర్చకులు బ్రహ్మ శ్రీ మాముదాల పాండురంగ శర్మ, బ్రహ్మ శ్రీ డాక్టర్ మాముదాల శ్రీకాంత శర్మ తదితరులు పాల్గొన్నారు.


**జయభేరి, ఉప్పల్**




కుషాయిగూడ పాస్టర్స్ ఫెలోషిప్, ఆధర్వ్యం లో రన్ ఫర్ జీసస్ రాలీ నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే బండారి లక్ష్మా రెడ్డి హాజరై జెండా ఊపి ర్యాలీ ని ప్రారంభించినారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. క్రైస్తవుల పక్షముగా ఉండి వారికి ఏ సమస్య వచ్చినా వారికి సహాయ పడతాను అని మాట్లాడారు. కె.పీ.ఎఫ్, టీమ్ నీ అభినందించి అలాగె ఇంత చక్కాగా కార్యక్రమం నిర్వహించిన కె.పీ.ఎఫ్, ప్రెసిడెంట్. రెవ. సరిళ్ళ రాజుని ఇలాంటి అనేక కర్యక్రమాలు జరిగించాలి అని వారి టీమ్, సిస్టర్ జ్యోతీ, పాస్టర్. జాన్ కెనడి, పాస్టర్ ఉదయ్, ఏసురత్నం, సుదర్శన్, శామ్, రమేష్ ని అభినందించారు.

**జయభేరి, ఉప్పల్**

## న్యాయవాదుల అసోసియేషన్ అధ్యక్షులుగా గాజుల ఆంజనేయులు



**జయభేరి, దేవరకొండ :**

దేవరకొండ న్యాయస్థానంలో శనివారం న్యాయవాదుల అసోసియేషన్ ఎన్నికలు నిర్వహించడం జరిగింది. ఈ ఎన్నికలలో అధ్యక్షులుగా సీనియర్ న్యాయవాది గాజుల ఆంజనేయులు, ప్రధాన కార్యదర్శి మొహమ్మద్ శౌకత్ అలీ, ఉపాధ్యక్షులు కర్నాటి సురేష్, సహ కారదర్శి శ్రీమతి వనం పుష్పలత, కోశాధికారి ఇడెం రవికుమార్, స్పోర్ట్స్ సెక్రటరీ కోరే శ్రీనివాస్, మరియు కార్యవర్గ సభ్యులు బోడ్డు ఆంజనేయులు, జున్ను ఇద్దయ, కోరే కిషన్, రమావత్ గణేషులు ఎన్నుకోబడ్డారు. ఎన్నికల అధికారీగా ఇడెం రవి కుమార్, సహయ అధికారి సపావత్ శ్రీకాంత్ లు వ్యవహరించారు. అధ్యక్షులుగా గాజుల ఆంజనేయులు ఎన్నిక సందర్భంగా న్యాయవాదులు అందరూ హర్షం వ్యక్తం చేసి శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు.




## నా తల్లిదండ్రులకు ఎంతో రుణపడి ఉన్నాను..

**జయభేరి, ఇల్లందు :**

నాకు జన్మనిచ్చి ఈ లోకాన్ని పరిచయం చేసినటువంటి నా తల్లిదండ్రులకు ఎంతో రుణపడి ఉన్నాను. ముస్లిం సమాజానికి చదువుల నిమిత్తం మాకు పాఠశాలలు కళాశాలలు ఏర్పాటు చేసినటువంటి కెసిఆర్ కు కృతజ్ఞతలు. ఈ స్కూలను సక్రమంగా స్థాపించి ఉన్నతమైన చదువులను అందించాలని దృఢ సంకల్పంతో, తపనతో తన జీవితాన్ని ధార పోసినటువంటి షఫీ ఉల్లా కి నా హృదయపూర్వక కృతజ్ఞతలు. ఈ స్కూళ్లలో మా జీవితాలను ఐదు సంవత్సరాల పాటు మాకు అహర్నిశలు కృషి చేసి మాకు జ్ఞానాన్ని ప్రసాదించి సమాజంలో ఒక వ్యక్తిగా తీర్చి దిద్దిన ప్రధానోపాధ్యాయ, అధ్యాపక బృందం, నాన్ టీచింగ్ వారికి ఎనలేని కృతజ్ఞతలు తెలుపుతున్నాను. నేను స్కూల్ నుండి బయటికి వస్తున్నప్పుడు నా హృదయం ఎంతో తపనతో బాధతో, నా కనులు బరువై కన్నీటి దారులు కారుతున్నాయి. మంచి జ్ఞానంతో పంపుతున్నటువంటి స్కూల్ నూ చూస్తూ బయటికి వస్తున్నాను. ఈ స్కూలు కు నేను ఎంతో రుణపడి ఉన్నాను. సయ్యద్ సైఫూర్ రహమాన్, S/o సయ్యద్ మహబూబ్ పాషా, 10వ తరగతి, తెలంగాణ మైనార్టీ రెసిడెన్షియల్ స్కూల్, ఇల్లందు బాయ్స్1.

## కీలక మలుపులు తిరుగుతోన్న రాడిసన్ డ్రగ్స్ కేసు

- సెలబ్రేటీలకు క్రోమోటోగ్రఫీ పరీక్షలు



**జయభేరి, హైదరాబాద్, మార్చ్ 30:**

రాడిసన్ డ్రగ్స్ కేసు కీలక మలుపులు తిరుగుతోంది. కేసు నుంచి తప్పించుకునేందుకు ఎవరి ప్రయత్నాలు వారు చేస్తుంటే.. నిందితులను పట్టుకునేందుకు పోలీసులు తమ ప్రయత్నాలు చేస్తున్నారు. తాజాగా రాడిసన్ హోటల్ డ్రగ్స్ కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. పార్టీకి వెళ్లిన వారిలో డ్రగ్స్ను గుర్తించేందుకు క్రోమోటోగ్రఫీ పరీక్షలు నిర్వహిం చేందుకు పోలీసుల ప్రయత్నం చేస్తున్నారు. దీనికోసం కూకట్పల్లి కోర్టును పోలీసులు అనుమతి కోరారు. న్యాయస్థానం అనుమతి ఇవ్వకపోవడంతో పోలీసులు హైకోర్టు ను ఆశ్రయించారు. డ్రగ్స్ కేసులో నిందితులను గుర్తించేందుకు కొంతమందికి క్రోమోటోగ్రఫీ పరీక్షలు నిర్వహించేందుకు అనుమతించాలని హైకోర్టును కోరుతున్నారు. ఈ ఏడాది ఫిబ్రవరి 24వ తేదీన రాడిసన్ హోటల్లో డ్రగ్స్ పార్టీ జరిగినట్లు పోలీసులు చెబుతున్నారు. ఈ కేసులో నిందితులుగా మొత్తం 14 మందిని గుర్తించారు. వీరిలో ముగ్గురు మాత్రమే డ్రగ్స్ తీసుకున్నట్లు నిర్ధారణ అయింది. కొంతమంది సెలబ్రెటీస్ సమయం తీసుకుని విచారణకు రావడంతో.. వారి నమూనాల్లో డ్రగ్స్ ఆనవాలు కనిపించలేదని పోలీసులు చెబుతున్నారు. వారి శరీరాల్లో డ్రగ్స్ గుర్తించేందుకు క్రోమోటోగ్రఫీ పరీక్షలు నిర్వహించాలని పోలీసులు నిర్ణయించారు. ఇప్పటివరకు తెలుగు రాష్ట్రాల్లో ఎవరికి క్రోమోటోగ్రఫీ పరీక్ష చేయనట్లు తెలుస్తోంది. గచ్చిబౌలిలోని రాడిసన్ హోటల్లో డ్రగ్స్ తీసుకున్న కొందరు యువకులను ఫిబ్రవరి 26వ తేదీన పోలీసులు అరెస్ట్ చేశారు. రాడిసన్ హోటల్లో సదరు యువకులు గ్రాండ్గా పార్టీ చేసుకున్నారు. వారిలో ఒక ప్రముఖ బీజేపీ నేత కుమారుడితో పాటు వ్యాపారవేత్త కుమారుడు, మరికొంతమంది సినీ రంగానికి చెందిన ప్రముఖులు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. యువకులు పెద్ద ఎత్తున డ్రగ్స్ పార్టీ చేసుకుంటున్నారన్న పక్కా సమాచారంతో పోలీసులు రాడిసన్ హోటల్పై దాడి చేశారు. డ్రగ్స్ తీసుకున్నట్టు గుర్తించి ముగ్గురు యువకులను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద పెద్ద మొత్తంలో కొకైన్ స్వాధీనం చేసుకున్నారు. ఆ తర్వాత మరికొంతమంది సినీ రంగానికి చెందిన ప్రముఖులకు విచారణకు హాజరుకావాలని నోటీసులు పంపించిన విషయం తెలిసిందే.

## వరంగల్ బరిలో ఎవరు..

**జయభేరి, వరంగల్, మార్చి 30:**

వరంగల్ ఎంపీ టికెట్ కడియం కావ్య తిరస్కరించడంతో ఆ స్థానం ఖాళీ అయింది. దీంతో పలువురు సీనియర్ నేతలు ఆ స్థానం నుంచి పోటీ చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్, మాజీ కార్పొరేషన్ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్ వరంగల్ ఎంపీ టికెట్ ఆశిస్తున్నట్లు తెలుస్తోంది. అలాగే మరో కీలక నేత ఇటీవల ప్రజాశాంతి పార్టీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు అయిన ప్రముఖ సినీ నటుడు బాబూ మోహన్ను వరంగల్ బరిలో ఉంచాలని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఆయనకు ఫోన్ చేసినట్లు చెబుతున్నారు. అందరి కంటే ఎక్కువగా తాటికొండ రాజయ్య పేరు ఎక్కువగా వినిపిస్తోంది. ప్రస్తుతం ఆయన బీఆర్ఎస్ కు రాజీనామా చేశారు. కానీ కాంగ్రెస్ పార్టీ చేర్చుకోలేదు. టిక్కెట్ కోసం పరిశీలన చేయలేదు. దీంతో అటూ ఇటూ కాకుండా అయిపోయారరు. ఇటీవల అసెంబ్లీ ఎన్నికల్లో రాజయ్యకు టిక్కెట్ నిరాకరించి కడియం శ్రీహరికి కేసీఆర్ చాన్సిచ్చారు. ఇప్పుడు పార్లమెంట్ టిక్కెట్ కూడా కడియం కుమార్తెకే ఇచ్చారు. అయినా ఆయన పార్టీకి గుడ్ బై చెప్పారు. కడియం కావ్య ఎన్నికల్లో పోటీకి నిరాకరించి కాంగ్రెస్ పార్టీలో చేరేందుకు సిద్ధమైన నేపథ్యంలో రాజయ్యను బరిలోకి దింపాలని బీఆర్ఎస్ ఆలోచిస్తున్నట్టు సమాచారం. ఈ మేరకు ఆయనతో బీఆర్ఎస్ నేతలు సంప్రదింపులు జరుపుతున్నట్టు తెలుస్తోంది. గత అసెంబ్లీ ఎన్నికల్లో టికెట్ ఇవ్వకపోవడంతో బీఆర్ఎస్ పార్టీకి రాజయ్య రాజీనామా చేశారు. స్టేషన్ఘన్పూర్ టికెట్ ఆశించి భంగపడటంతో ఆయన బీఆర్ఎస్ నుంచి బయటకు వచ్చారు. అయితే వేరే ఏ పార్టీలోనూ చేరకపోవడంతో వరంగల్ ఎంపీ ఎన్నికల్లో ఆయనను పోటీ చేయిందుకు జిల్లాకు చెందిన బీఆర్ఎస్ మంతనాలు సాగిస్తున్నారు. రాజయ్య కూడా పోటీచేసేందుకు ఆసక్తి చూపిస్తున్నట్టు తెలుస్తోంది. త్వరలోనే బీఆర్ఎస్ అధినేత కేసీఆర్తో ఆయన భేటీ అవుతారని సమాచారం. తన నిర్ణయాన్ని కేసీఆర్కు తెలియజేసే అవకాశముందని తెలుస్తోంది. బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థిగా ఖరారైన కడియం శ్రీహరి కుమార్తె కావ్య కాంగ్రెస్ పార్టీలో చేరేందుకు సిద్ధమయ్యారు. కాంగ్రెస్ నుంచి ఆమెకు టికెట్ ఇచ్చే అవకాశముందని ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలో సీనియర్ నాయకుడైన రాజయ్య పేరును బీఆర్ఎస్ తెరపైకి తెచ్చింది. ఒకవేళ కడియం శ్రీహరి కుమార్తెకు కాంగ్రెస్ టికెట్ ఇస్తే.. రాజయ్యే సరైన ప్రత్యర్థి అవుతారని బీఆర్ఎస్ భావిస్తున్నట్టు తెలుస్తోంది. ఎర్రోళ్ల శ్రీనివాస్ పేరు కూడా వినిపిస్తున్నప్పటికీ జిల్లా నేతలు రాజయ్య వైపు మొగ్గు చూపిస్తున్నట్టు చెబుతున్నారు. కేసీఆర్కు బాబూమోహన్ కు కూడా మంచి అనుబంధం ఉంది. కేసీఆర్ ఏ నిర్ణయం తీసుకుంటారన్నదానిపై ఆసక్తి ఏర్పడింది.

# అక్రమ వెంచర్లు.. అడ్డగోలు అమ్మకాలు

- వ్యవసాయ భూములను ప్లాట్లుగా మారుస్తూన్న వైనం..
- కనీస సౌకర్యాలు కల్పించకుండానే ప్లాట్ల విక్రయాలు..
- ప్రభుత్వ ఖజానాకు భారీగా గండి కొడుతున్న అక్రమార్కులు..

**జయభేరి, మేడ్చల్ :**

మేడ్చల్ జిల్లా గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని మైసమ్మగూడలో అనుమతులు లేకుండానే విచ్చలవిడిగా వ్యవసాయ భూములను రియల్ ఎస్టేట్ వ్యాపారులు లేఅవుట్లుగా మార్చేస్తున్నారు.దీంతో వ్యవసాయ భూములు కనుమరుగు అవుతున్నాయి. నాలా కన్వర్షన్ లేకుండానే ప్లాట్లుగా మారుస్తూ జోరుగా విక్రయాలు జరుపుతూ ప్రభుత్వ ఆదాయానికి గండి కొట్టడమే కాకుండా ప్రజలను మోసం చేస్తున్నారు.నగరానికి దగ్గరలో ప్లాట్లు కొనుగోలు చేయాలని భావిస్తున్న మధ్య తరగతి ప్రజల ఆశను రియల్ వ్యాపారులు సొమ్ము చేసుకుంటున్నారు. కాసులకు కక్కుర్తిపడి నిబంధనలను తుంగలో తొక్కుతున్నారు.నిబంధనల ప్రకారం నాలా పన్ను చెల్లించిన తర్వాతనే వ్యవసాయ భూములు లే అవుట్లు చేసి వ్యవసాయేతర భూములుగా మార్చాలి.గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని మైసమ్మగూడలో మాత్రం పరిస్థితి అందుకు విరుద్ధంగా ఉంది. ప్రభుత్వం నుండి ఎలాంటి అనుమతులు లేకుండానే ప్లాట్లు చేసి అమ్ముకుని సొమ్ముచేసుకుంటున్నారు. ఏదైనా వెంచర్ ఏర్పాటు చేయాలంటే హెచ్ఎండిఏ నిబంధనల ప్రకారం ప్రభుత్వ అనుమతి పొంది ఉండాలి. అంతేకాకుండా వెంచర్ లో ప్లాట్లు కొనుగోలు చేసిన వ్యక్తి కనీస అవసరాలైన రోడ్లు,డ్రైనేజీ,విద్యుత్ పార్కు తదితర అవసరాలకు కల్పించాలి. కానీ మైసమ్మగూడలో ఇలాంటి నిబంధనలు మాకు చెల్లవంటూ వ్యవసాయ భూములను తమకు ఇష్టం వచ్చినట్లు ప్లాట్లుగా మలిచి ప్రజలకు విక్రయిస్తున్నారు.రియల్ వ్యాపారులు ప్రభుత్వానికి పన్ను చెల్లించకుండా వ్యవసాయ భూమిని ప్లాట్లుగా మారుస్తూ ప్రభుత్వ ఆదాయానికి గండి కొట్టడమే కాకుండా వివిధ సౌకర్యాలు కల్పించకుండా ప్లాట్లు కొనుగోలు చేసే ప్రజలను సైతం మోసగిస్తున్నా అధికారులు వ్యాపారుల మామూళ్ల మత్తులో పట్టించుకోవడం లేదని ప్రజల నుంచి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. రెవెన్యూ, మున్సిపాలిటీ, పట్టణ ప్రణాళిక శాఖల అధికారులకే అక్రమ లే అవుట్లపై చర్యలు తీసుకునే అధికారం ఉంటుంది. కానీ వారు ఈ అక్రమ లేఅవుట్ల వైపు చూడకపోవడంతో పలు విమర్శలకు తావిస్తోంది. వ్యవసాయ భూములను అక్రమ వెంచర్లు చేసి ప్లాట్లు విక్రయిస్తున్న వారిలో ప్రజాప్రతినిధుల బంధువులు ఉండటం వల్లనే అధికారులు చూసి చూడనట్లుగా వ్యవహరిస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు.





**అనుమతులు లేకుండా..**

వ్యవసాయ భూముల్లో అక్రమంగా ఎలాంటి అనుమతులు లేకుండా వెంచర్ నిర్మాణం చేసి హద్దు రాళ్లు ఏర్పాటు చేసిన సంబంధిత అధికారులు చూసి చూడనట్లుగా ఉండటంపై అలు అనుమానాలకు తావిస్తోంది. గతంలో మైసమ్మగూడ గ్రామ పరిధిలో ఇలాంటి అనుమతులు లేని వెంచర్ నిర్మాణం జరిగిందని పలు మీడియా పత్రికలలో వచ్చిన సంగతి విదితమే ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో అక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరికలు వస్తున్న చర్యలు తీసుకోకడంలో అధికారుల అలసత్వం ఏమిటనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. మైసమ్మగూడలో మల్లారెడ్డి ఇంజనీరింగ్ కళాశాల యూనివర్సిటీగా మారడంతో కళాశాలలో చదువుతున్న విద్యార్థులకు వసతి కోసం హాస్టల్ వ్యాపారం లాభసాటిగా కొనసాగుతుండటంతో ఇక్కడ వ్యాపారం చేయాలనుకునే వ్యాపారులు మైసమ్మగూడలో ప్లాట్లు కొనేందుకు చాలా ఆసక్తి చూపిస్తున్నారు. దీంతో ఇక్కడ ప్లాట్లకు ఎక్కడలేని డిమాండ్ రావడంతో ఇదే అదనుగా భావించిన అక్రమార్కులు వ్యవసాయ భూములను ప్లాట్లుగా మార్చి సామాన్యులను విక్రయిస్తు సొమ్ము చేసుకుంటున్నారు. హెచ్ఎండీఏ అనుమతులు లేకుండానే కొందరు అధికారుల చేతులు తడుపుతూ ఇలాంటి అక్రమ లేవుట్ ల ఏర్పాటుకు పాల్పడుతున్నారని పలువురు ఆరోపిస్తున్నారు.

# రేవంత్ ను కలిసిన సుహాసినీ

**జయభేరి, హైదరాబాద్, మార్చి 30**



తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని దివంగత నందమూరి హరికృష్ణ కూతురు, టీడీపీ నాయకురాలు నందమూరి సుహాసిని కలిశారు. రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్చార్జి దీపాదాస్ మున్షీ, మంత్రి కొండా సురేఖ, ఎమ్మెల్సీ పట్నం మహేందర్ రెడ్డి సమక్షంలో ఆమె రేవంత్ ను కలిశారు. లోక్ సభ ఎన్నికల సమయంలో రేవంత్ ను సుహాసిని కలవడం ఆసక్తికరంగా మారింది. 2018 ఎన్నికల్లో మహాకూటమిలో భాగంగా టీడీపీ తరఫున కూకట్ పల్లి నియోజకవర్గం నుంచి సుహాసిని పోటీ చేశారు. సుహాసిని ప్రస్తుతం తెలంగాణ టీడీపీ ఉపాధ్యక్షురాలిగా ఉన్నారు. ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీలో చేరికల జోరు సాగుతోంది. వివిధ పార్టీల నేతల్ని.. కాంగ్రెస్ నేతలు ఆకర్షిస్తున్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో బారీ విజయమే లక్ష్యంగా నేతల్ని ఆకర్షిస్తున్నారు. ఈ క్రమంలో నందమూరి సుహాసినితోనూ చర్చలు జరిపినట్లుగా భావిస్తున్నారు. మర్యాదపూర్వక భేటీ అయితే.. దీపాదాస్ మున్షితో పాటు మల్కాజిగిరి సీటుకు పోటీ చేస్తున్న అభ్యర్థులు కూడా ఈ సమావేశానిగి హాజరవ్వాల్సిన అవసరం ఉండదని భావిస్తున్నారు. ఖచ్చితంగా రాజకీయ ఎజెండాతోనే సమావేశం జరిగి ఉంటుందని భావిస్తున్నారు. తెలుగుదేశం పార్టీ ఎన్డీఏలో చేరింది.కానీ పార్లమెంట్ ఎన్నికల్లో తెలంగాణ నుంచి పోటీ చేయడం లేదు. అసెంబ్లీ ఎన్నికల్లోనూ పోటీ చేయలేదు. దీంతో టీడీపీ నేతలంతా నిరాశకు గురయ్యారు. ఈ క్రమంలో నందమూరి సుహానికి కాంగ్రెస్ పార్టీలో చేరి రాజకీయంగా అదృష్టాన్ని పరీక్షించుకోవాలనుకుంటున్నారన్న చర్చ జరుగుతోంది. అదే సమయంలో సుహాసిని కాంగ్రెస్ పార్టీలో చేరినా చేరకపోయినా.. ఈ సమావేశం ద్వారా టీడీపీ సానుభూతి పరుల మద్దతు కాంగ్రెస్ కు లభించేలా చేసుకోచ్చని భావిస్తున్నారు. టీడీపీ ఎన్నికల్లో పోటీ చేయడం లేదు కాబట్టి.. టీడీపీ సానుభూతిపరుల ఓట్లు కీలకం అయ్యే అవకాశం ఉంది. పోటీ హోరాహోరీగా సాగుతుందని భావిస్తున్న సమయంలో సుహాసిని... కాంగ్రెస్ ముఖ్య నేతలతో భేటీ ఆసక్తికరంగా మారిందిప్రస్తుతం తెలుగుదేశం పార్టీ సమీప భవిష్యత్లో ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం కనిపించడం లేదు. అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ నుంచి విరమించుకున్న తర్వాత పూర్తి స్తబ్దుగా అయిపోయారు. తెలంగాణ టీడీపీ అధ్యక్షుడిగా ఉన్న కాసాని జ్ఞానేశ్వర్ బీఆర్ఎస్ లో చేరిపోయారు. చేవెళ్ల పార్లమెంట్ స్థానం నుంచి పోటీ చేస్తున్నారు. ఇతర నేతలంతా సైలెంట్ అయిపోయారు. పార్లమెంట్ ఎన్నికల్లో నూ పోటీ చేసేందుకు సిద్ధంగా లేరు. పార్టీ అధ్యక్షుడ్ని కూడా ఇంకా నియమించలేదు. ఈ క్రమంలో టీడీపీ నేతలు రాజకీయ భవిష్యత్ కోసం కాంగ్రెస్ పార్టీ వైపు చూసే అవకాశాలు కనిపిస్తున్నాయి.

# కడియంపై అనర్హత వేటు

**జయభేరి, హైదరాబాద్, మార్చి 30:**



బీఆర్ఎస్ లో కీలక నేతలు ఆ పార్టీని ఒక్కొక్కరుగా వీడుతున్నారు. ఇటీవల సీనియర్ నేత కె.కేశవరావు, ఆయన కుమార్తె విజయలక్ష్మి బీఆర్ఎస్ ను వీడారు. ఇప్పటికే విజయలక్ష్మి కాంగ్రెస్ లో చేరగా, కేకే సైతం త్వరలోనే హస్తం గూటికి చేరనున్నారు. తాజాగా, స్టేషన్ ఘన్పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి సైతం కాంగ్రెస్ తీర్థం పుచ్చుకునేందుకు సిద్ధమయ్యారు. ఇటీవలే ఆయన కుమార్తె కడియ కావ్య సైతం వరంగల్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థిగా పోటీ నుంచి తప్పుకొన్నారు. అయితే, కడియం శ్రీహరిపై బీఆర్ఎస్ చర్యలకు సిద్ధమైనట్లు తెలుస్తోంది. ఆయనపై అనర్హత పిటిషన్ వేయాలని నిర్ణయించింది. ఈ మేరకు స్పీకర్ కు పిటిషన్ ఇచ్చేందుకు శనివారం మధ్యాహ్నం అసెంబ్లీకి బీఆర్ఎస్ నేతల బృందం చేరుకుంది. ఆ పార్టీ ఎమ్మెల్యేలు కాలేరు వెంకటేశ్, లక్ష్మారెడ్డి, ముఠా గోపాల్ స్పీకర్ కు పిటిషన్ ఇవ్వాలని యత్నించారు. అయితే, స్పీకర్ అందుబాటులో లేరని అసెంబ్లీ సిబ్బంది తెలిపారు. దీంతో అసెంబ్లీ కార్యదర్శిని కలిసేందుకు ప్రయత్నించగా ఆయన కూడా అందుబాటులో లేరని తెలిసింది. ఈ క్రమంలో డిప్యూటీ సెక్రటరీకి పిటిషన్ ఇచ్చేందుకు సిద్ధం కాగా ఆయన స్వీకరించేందుకు నిరాకరించినట్లు తెలుస్తోంది. ఇప్పటికే కాంగ్రెస్ లో చేరిన దానం నాగేందర్ పై అనర్హత వేటు వేయాలని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు స్పీకర్ ను కోరిన విషయం తెలిసిందే. మరోవైపు, కడియం శ్రీహరి, ఆయన కుమార్తె కావ్యతో కలిసి మంత్రుల నివాస ప్రాంగణంలో.. తన అనుచరులతో సమావేశమయ్యారు. పార్టీ మారేందుకు సిద్ధమైన నేపథ్యంలో భవిష్యత్ కార్యాచరణపై వారితో సుదీర్ఘంగా చర్చించారు. కాంగ్రెస్ నేతలు తనను పార్టీలోకి ఆహ్వానించారని.. రెండు రోజుల్లో నిర్ణయం ప్రకటిస్తానని చెప్పినట్లు తెలిపారు.

'బీఆర్ఎస్ నేతలు అయోమయంలో ఉన్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా బీఆర్ఎస్ బలహీన పడింది. పార్టీ నేతల నుంచి సహకారం లభించలేదు. ఓడిపోయే పార్టీ నుంచి పోటీ వద్దని కావ్య అనుకున్నారు. కాంగ్రెస్ నుంచి పోటీ చేయాలని పిలుపు వచ్చింది. అందరి అభిప్రాయం మేరకు నిర్ణయం ఉంటుంది. ఆరూరి రమేష్ వద్దంటేనే కావ్యకు టికెట్ ఇచ్చారు. నన్ను విమర్శించే నైతిక హక్కు ఎవరికీ లేదు. కావ్యను నిండు మనసుతో అందరూ ఆశీర్వదించాలి.' అని కడియం పేర్కొన్నారు. అటు, కడియం ఏ నిర్ణయం తీసుకున్నా తాము మద్దతిస్తామని ఆయన అనుచరులు స్పష్టం చేశారు.అటు, జీహెచ్ఎంసీ మేయర్ జి.విజయలక్ష్మి కాంగ్రెస్ పార్టీలో చేరారు. సీఎం రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇంఛార్జీ దీపాదాస్ మున్షీ సమక్షంలో శనివారం హస్తం తీర్థం పుచ్చుకున్నారు. సీఎం కండువా కప్పి ఆమెను సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. మరోవైపు, రాజ్యసభ సభ్యుడు కె.కేశవరావు సైతం త్వరలోనే కాంగ్రెస్ గూటికి చేరనున్నారు.

## టైగర్ జోన్లను నిలిపివేయాలి

- మావోయిస్టుల హెచ్చరిక

**జయభేరి, భద్రాద్రి:**

భద్రాద్రి కొత్తగూడెం, అల్లూరి సీతారామరాజు జిల్లా మావోయిస్టు పార్టీ డివిజన్ కమిటీ పేరిట లేఖలు విడుదల చేసారు. తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ సరిహద్దు ప్రాంతమైన కన్నాయిగూడెం వద్ద మావోయిస్టు కరపత్రాలు వెలసాయి. ఆదివాసీలను విస్తాపన చేసే కార్పొరేట్ కంపెనీలు అయినా మైనింగ్స్, ప్లాంట్లు, రోడ్లు డ్యాములు టైగర్ జోన్లు నిలిపివేయాలని కార్పొరేట్ సెక్యూరిటీ పోలీస్ క్యాంపులను ఉద్యమాలను అణిచివేసే పార మిలటరీ బలగాలను, స్పెషల్ బలగాలను కూడా నిలిపి వేయాలని రోడ్లపై మావోయిస్టుల కరపత్రాలు కనబడ్డాయి. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అల్లూరి సీతారామరాజు జిల్లా ఎటపాక మండల పోలీస్ స్టేషన్ కు కూత వేటు దూరంలో ఈ కరపత్రాలు వెలవడంతో గ్రామస్తులు భయాందోళన చెందుతున్నారు.



## ఫోన్ ట్యాపింగ్ కేసును సిబిఐ అప్పగించాలి

- మహేశ్వర్ రెడ్డి బీజేపీ ఫ్లోర్ లీడర్..

**జయభేరి, హైదరాబాద్ :**


100రోజుల్లో ఇచ్చిన హామీలు అమలు చేయలేక కాంగ్రెస్ ఎదో ఒక అంశాన్ని తెరపైకి తెస్తుంది. ఎంత అభద్ర భావం తో పని చేస్తుందో పరిణామాలు చుస్తే తెలుస్తోందని బీజేపీ ఫ్లోర్ లీడర్ మహేశ్వర్ రెడ్డి వ్యాఖ్యానించారు. ఏ మంత్రి ఎప్పుడు తన సీటుకు ఎసరు తెస్తాడో అని రేవంత్ రెడ్డికి భయం తో నిద్ర పట్టడం లేదు . కోమటిరెడ్డి ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నాడు. ఎనిమిది మంది ఎమ్మెల్యేలు టచ్ లో ఉన్నారు అంటున్నాడు. అసలు మీ తమ్ముడు టచ్ లో ఉన్నాడో లేడో తెలుసు కో. మా ఎమ్మెల్యేలలో ఒక్కరి ముట్టుకున్న 48 గంటలో మీ ప్రభుత్వం కూలిపోయింది గుర్తు పెట్టుకో. ముఖ్యమంత్రి హోదాలో ఉన్ననీవు ఈరోజు సీబీఐ విచారణ ఎందుకు విచారణ ఎందుకు ఆదేశించడం లేదు. రంజిత్ రెడ్డి భూములపై ఆరోపణలు చేసావు.. ఇప్పుడు ఆయనను కండువా కప్పి పక్కన కూర్చో పెట్టుకున్నావు. కాళేశ్వరం ప్రాజెక్టుపై విచారణ కు సీబీఐకు ఎందుకు ఇవ్వడం లేదు. టెలిఫోన్ యాక్ట్ కేంద్ర ప్రభుత్వనికి సంబంధించినది కావున దీనిని కూడా సిబిఐ కి ఇవ్వాలి. మా ఎమ్మెల్యేల గురించి మాట్లాడే స్థాయి నీకు లేదని అన్నారు. దమ్ముంటే మీ భువనగిరి ఎంపీ గెలిపించుకో.భువనగిరి సీటును రెండు లక్షల మెజార్టీ తో గెలుస్తాం.మిలాగా మేము గేట్లు తీస్తే మీ ప్రభుత్వం 48 గంటలు ఉండదు. కానీ మాకు ప్రజాస్వామ్యం గౌరవిస్తాం. కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి వెళ్లి నితిన్ గడ్కరీ ని కలసి వచ్చావు. నీవు మా అధిష్టానం తో టచ్ లో ఉన్నావు. షిండే పాత్ర నేను అంటే నేను పోషిస్తా అంటూ వస్తున్నారు. నీలాంటి వారు 5 గురు మంత్రులు మా హైకమాండ్ తో టచ్ లో ఉన్నారు. ఈటెల రాజేందర్ మా పార్టీలో కి వస్తే రాజీనామా చేసి వస్తేనే తీసుకున్నాం. కొత్త గా ఆర్ టాక్స్ వసూలు చేస్తున్నారు. ఆర్ టాక్స్ అంటే రేవంత్ టాక్స్ నా, రాహుల్ టాక్స్ నా రాజీవ్ టాక్స్ నా మాకు తెలియదు. ఇప్పటి 1500 కోట్లు డబ్బులు పంపించారు. ఇంకా 500 పంపడం కోసం ఈ టాక్స్ వసూలు చేస్తున్నారు. చిట్టా మొత్తం మా వద్ద ఉంది.. సందర్భం వచ్చినప్పుడు అన్ని బయట పెడుతము. వెంకట్ రెడ్డి ని స్థాయి హోం గార్డ్ నే ఏమైన ఉంటే మీ ఎస్పీనే మాట్లాడమనని అన్నారు.

## కేటీఆర్, హరీష్ రావు నీతిమంతుల్లా మాట్లాడుతున్నారు

**జయభేరి, హైదరాబాద్:**

కేటీఆర్, హరీష్ రావు నీతిమంతుల్లా మాట్లాడుతున్నారని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. పార్లమెంట్ ఎన్నికల తర్వాత బిఆర్ఎస్ పార్టీ కనుమరుగు కాబోతుంది. కల్వకుంట్ల కుటుంబ నేతలను మించిన పవర్ బ్రోకర్లు ఇంకెవరు లేరు. పది సంవత్సరాలు ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసిన చరిత్ర బీఆర్ఎస్ పార్టీది. తాము చేస్తే సంసారం..వేరే వాళ్ళు చేస్తే వ్యభిచారం లా హరీష్ రావు, కేటీఆర్ ప్రవర్తిస్తున్నారు. బిఆర్ఎస్ పాలనలో సొంత పార్టీ ఎమ్మెల్యే,ఎంపిలను కూడా కలవని నీచ చరిత్ర కేసీఆర్ దని అన్నారు. బిఆర్ఎస్ ఎమ్మెల్యేలను చేర్చుకోవలని సీఎం రేవంత్ రెడ్డి తలచుకుంటే 24గంటల్లో బిఆర్ఎస్ ఎమ్మెల్యేలు ఖాళీ అవుతారు. తెలంగాణ భవన్ అయిన పార్టీ ఆఫీస్ ను మూసివేసి స్టార్ హోటల్ గా మార్చి బిజినెస్ చేసుకుంటే హరీష్,కేటీఆర్ కి మంచిదని అన్నారు.

# మూవీభేరి



## సెన్సార్ పూర్తి చేసుకున్న 'ఫ్యామిలీ స్టార్'..

టాలీవుడ్ నటుడు విజయ్ దేవరకొండ, మృణాళ్ ఠాకూర్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న తాజా చిత్రం 'ఫ్యామిలీ స్టార్' పరశురాం ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తుండగా.. శ్రీవెంకటేశ్వర క్రియేషన్స్ పతాకంపై దిల్ రాజు, శిరీష్ నిర్మిస్తున్నారు. ఈ సినిమా ఏప్రిల్ 05న ప్రేక్షకుల ముందుకు రానుంది. అయితే విడుదల తేదీ దగ్గరపడుతుండటంతో మేకర్స్ ప్రమోషన్స్ మొదలుపెట్టిన విషయం తెలిసిందే. ఇప్పటికే సినిమా నుంచి టీజర్‌తో పాటు ట్రైలర్ విడుదల చేయగా మంచి రెస్పాన్స్ దక్కించుకుంది. ఇదిలావుంటే తాజాగా ఈ చిత్రం సెన్సార్ పూర్తి చేసుకుంది. సెన్సార్ బోర్డు సభ్యులు ఈ సినిమాకు యు/ఏ సర్టిఫికేట్‌ను జారీ చేసినట్లు సమాచారం. ఇక రన్‌టైం విషయానికి వస్తే.. ఈ మూవీ 2 గంటల 40 నిమిషాలు ఉన్నట్లు టాక్. ఇక ఈ సినిమాలో రష్మిక మందన్న అతిథి పాత్రలో నటించగా, దివ్యాంశ కౌశిక్ ఒక ముఖ్యమైన పాత్రను పోషించింది. దిల్ రాజు ఈ చిత్రాన్ని భారీ ఎత్తున నిర్మిస్తున్నారు.

## ఒకటి చెబితే అది జనాల్లోకి మరోలా!

అనసూయ తాజాగా ఈ ప్రచారాలన్నింటిని అనసూయ ఖండించింది. తాను తుమ్మినా.. దగ్గినా కాంట్రవర్శీ చేస్తున్నారంటూ అసహనాన్ని వ్యక్తం చేసింది. యాంకర్ కం నటి అనసూయ ఇటీవలే జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ఆదేశిస్తే పార్టీ తరుపున ప్రచారం చేస్తానని ప్రకటించినట్లు వార్తలొచ్చిన సంగతి తెలిసిందే. ఆ పార్టీలో చేరి పవన్ కళ్యాణ్ కి తోడుగా ఉంటుందని మీడియాలో కథనాలు వైరల్ అయ్యాయి. రేపోమాపో పార్టీలే చేరిపోతుందని ప్రచారం సాగింది. ఈ ప్రచారంపై రకరకాల విశ్లేషణలు సైతం తెరపైకి వచ్చాయి. ఇంతకాలం జనసేన ఊసులేని అమ్మడు ఇప్పుడే పనిగట్టుకుని పార్టీ ప్రచారం ఏంటి? దీని వెనుక ఏదైనా ఎత్తుగడ ఉందా? అని కొన్ని ఊహాగానాలు నెట్టింట తెరపైకి వచ్చాయి. తాజాగా ఈ ప్రచారాలన్నింటిని అనసూయ ఖండించింది. తాను తుమ్మినా..దగ్గినా కాంట్రవర్శీ చేస్తున్నారంటూ అసహనాన్ని వ్యక్తం చేసింది. ఓ ఇంటర్వ్యూలో రాజకీయ ప్రవేశం గురించి ఇలా స్పందించింది. 'నాయకుడు నచ్చి..అతడి ఎజెండా నచ్చితే తప్పకుండా ప్రోత్సహిస్తానని చెప్పా. అంతే కానీ పార్టీలో చేరతానని గానీ ప్రచారం చేస్తానని గాని చెప్పలేదు. జనసేన పార్టీ అజెండా నాకెంతో నచ్చింది' అని తెలిపింది. ఆ కారణంగానే జనసేన పార్టీకి అనసూయ తన మద్దతు ప్రకటించినట్లు క్లారిటీ వచ్చింది. అయితే పార్టీలో చేరకుండా పార్టీని ఏ రకంగా ప్రోత్సహిస్తుందో? కూడా వివరణ ఇవ్వాలని అడుగుతున్నారు. పార్టీ అజెండా నచ్చినప్పుడు పార్టీ తరుపున క్యాపెనింగ్ చేసినప్పుడే ఆ పార్టీకి తన మద్దతు ఇచ్చినట్లు ఉంటుందని నెటి జనులు అభిప్రాయపడుతున్నారు. అంతేగానీ అజెండా నచ్చిందని..పార్టీని ప్రోత్సహి స్తానని ఓమాట అనేసి ఊరుకుంటే? ఆ పార్టీ ఎలా గెలుస్తుంది? మీ లాంటి వాళ్లు వెనుకుండో లేదా ముందుండో? నడిపిస్తే పార్టీ కోసం పనిచేసినట్లు ఉంటుందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. మరి ఎన్నికలు సమీపిస్తోన్న నేపథ్యంలో ఆ దిశగా అమ్మడు అడుగులు వేస్తుందా? నోటి మాటతోనే సరిపెడుతుందా? అన్నది చూడాలి. ఇటీవలే అనసూయ నటించిన 'రజాకార్' రిలీజ్ అయిన సంగతి తెలిసిందే. ఆ సినిమాకి విమర్శకుల నుంచి ప్రశంలొచ్చినా ఫ్లాప్ అయింది. ప్రేక్షకులకు ఆ సినిమా రీచ్ అవ్వేలేదు. భారీ ఎత్తున పాన్ ఇండియా లో రిలీజ్ చేసినా పనవ్వలేదు. ప్రస్తుతం అనసూయ మరో పాన్ ఇండియా చిత్రం 'పుష్ప 2' లో నటిస్తోంది. ఈ సినిమాపై భారీ అంచనాలే ఉన్నాయి.





## చిరుత బ్యూటీ రాజకీయాల్లోకి..

'చిరుత' సినిమాతో టాలీవుడ్ లో తెరంగేట్రం చేసిన నేహాశర్మ ఆ తరవాత పూర్తిగా బాలీవుడ్ లోనే నటిస్తున్న సంగతి తెలిసిందే. శర్మాగాళ్ కెరీర్ ఇటీవల అంతంత మాత్రమే. ఇప్పుడు లోక్ సభ ఎన్నికల్లో పోటీ చేసేందుకు రెడీ అవుతోందని కథనాలొస్తున్నాయి. ఇటీవలే నేహా శర్మ తండ్రి కాంగ్రెస్ నాయకుడు దీనిని ధృవీకరించడంతో సర్వత్రా ఆసక్తి నెలకొంది. నేహా శర్మ తండ్రి అజిత్ శర్మ బీహార్‌లోని భాగల్‌పూర్ నుండి కాంగ్రెస్ ఎమ్మెల్యేగా పనిచేస్తున్నారు. ఇటీవలి ఇంటర్వ్యూలో నేహా లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేయాలనే కోరికను వ్యక్తం చేశాడు. ఇది పార్టీ ద్వారా ప్రతిధ్వనించిన సెంటిమెంట్ అని అన్నాడు. ఆయన ప్రకటనతో నేహా శర్మను ఎంఎల్ఏగా చూడగలమని అభిమానులు భావిస్తున్నారు. అయితే ఎన్నికల్లో పోటీ చేసే ముందు ఆస్తుల వివరాల్ని వెల్లడించాల్సి ఉంటుంది. నేహాశర్మ సంపదలు ఎలా ఉన్నాయో తెలుసుకోవాలని ప్రయత్నిస్తే తెలిసిన వివరాలివి.. బీహార్‌లోని భాగల్‌పూర్‌కు చెందిన నేహా శర్మ 21 నవంబర్ 1987న జన్మించారు. మొదట్లో ఫ్యాషన్ డిజైనర్ కావాలనే కోరిక ఉండేది. దీంతో న్యూ ఢిల్లీలోని గౌరవనీయమైన నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫ్యాషన్ టెక్నాలజీ లో ఫ్యాషన్ డిజైన్‌లో విద్యను అభ్యసించేలా చేసింది. అయితే నిఫ్ట్ లో ఉన్నప్పుడే తనలోని మోడల్ కం నటిని గుర్తించింది నేహా. నటిగా ప్రయత్నాలు ప్రారంభించింది. 2007లో టాలీవుడ్‌లో 'చిరుత' చిత్రంతో అరంగేట్రం చేయడంతో కథానాయికగా ప్రయాణాన్ని ప్రారంభించింది. 2010లో ఇమ్రాన్ హష్మీతో కలిసి మోహిత్ సూరి క్రూక్ తో బాలీవుడ్ లో అడుగుపెట్టింది. క్యా సూపర్ కూల్ హై హమ్, తుమ్ బిన్ 2, తాన్హాజీ, యమ్లా పగ్లా దీవానా 2 వంటి భారీ చిత్రాల్లో నటించింది. నేహా శర్మ వార్షిక సంపాదన దాదాపు రూ. 3 కోట్లు. మొత్తం సంపద విలువ34 కోట్లు. నిజానికి బాలీవుడ్‌లో పాపులారిటీని నేహా శర్మ తెలివిగా క్యాష్ చేసుకుంది. తన వారసత్వ సంపద కలుపుకుని నికర ఆస్తి విలువ 34 కోట్లు ($4 మిలియన్లు)గా ఉందని అంచనా. ఈ గణనీయమైన సంపద సినిమాలు.. లాభదాయకమైన బ్రాండ్ ఎండార్స్‌మెంట్‌లు.. సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్‌లలో ప్రభావవంతమైన ఆదాయం ద్వారా సాధ్యమైంది. అధికారిక ప్రకటన వెలువడనప్పటికీ నేహా శర్మ తండ్రి, కాంగ్రెస్ ఎమ్మెల్యే అజిత్ శర్మ జాతీయ మీడియాతో మాట్లాడుతూ.. ''బాలీవుడ్ నటి అయిన నా కుమార్తె నేహా శర్మ లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసేందుకు పార్టీ ఆసక్తిని వ్యక్తం చేసింది. నేను తనతో చర్చించాను.. కానీ ఆమె ప్రస్తుతం అనేక కమిట్‌మెంట్‌లు షూటింగ్ షెడ్యూళ్లతో బిజీగా ఉంది'' అని తెలిపారు.

Printed and Published & Owned by MOTHE RAGHU THIRUPATHI REDDY, Printed at DOLPHIN GRAPHICS, #24-88/1, L.N. Colony, IDA Uppal, Hyderabad, Medchal-Malkajgiri, telangana-500039.
Published at # 2-20-2/71/C, Ganesh Nagar, Uppal, Hydrebad, Medchal-Malkajgiri-500039. Editor: M. R. Thirupathi Reddy. Cell: 9391 544 889 RNI No: TELTEL12264. email: jayabherinews@gmail.com, www.jayabheridaily.com